ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
తూర్పుగోదావరి
జిల్లా వార్తలు
సోమవారం 21 ఏప్రిల్ 2025 | 5



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.5 (ఆదివారం)
కనిష్ఠం : 25.5



నల్లజర్లలో కేక్ కటింగ్

మీ రాకడ కోసం..

ఈస్టర్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి.. వేకువజాము నుంచే కుటుంబీకుల సమాధులను పువ్వులతో అలంకరించి.. కొవ్వొత్తులు వెలిగించారు. ఆయా సమాధుల వద్దకు అంతా చేరుకుని ప్రార్థనలు చేశారు. తమవారిని తలచుకుని.. మీ రాకడకు ఎదురుచూ స్తున్నామంటూ కన్నీటి పర్యంతమయ్యారు..
- రాజమహేంద్రవరం సిటీ



రాజమహేంద్రవరం పోలీస్ క్వార్టర్స్ వద్ద జనంతో నిండిన బరియల్ గ్రౌండ్..ఆయా సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న క్రైస్తవులు

హ్యాపీ బర్త్‌డే బాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఊరూవాడా ఘనంగా జరిగాయి.. నాయకులు ఎవరికి తోచిన రీతిన వారు సేవా కార్యక్రమాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ పండుగలా చేశారు. కడియంలో 500 కేజీల ధాన్యంతో హ్యాపీ బర్త్‌డే సీఎం సార్ అంటూ తయారుచేసిన చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. - కడియం



పేదింటికి.. గడువు!



ఇళ్లకు మరో పది రోజులే దరఖాస్తుల స్వీకరణ

- సొంతింటికి దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడి జిల్లాలో 44,354
- కాకినాడలో అత్యధికం 18,500
- కోనసీమ జిల్లా 13,754
- తూర్పుగోదావరి 12,200
- 95 శాతం మందికి సొంత స్థలమే
- ఇప్పటికే వడపోత వేగవంతం
- తహశీల్దార్ల పొజిషన్ సర్టిఫికెట్లు
- కేంద్రం నుంచి అనుమతులు
- ఇంటికి రూ.2.50 లక్షల సాయం

(కాకినాడ,ఆంధ్రజ్యోతి)
సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పేదలు భారీగా ప్రభుత్వానికి దరఖాస్తులు చేశారు. వేలాది మంది సచివాలయాల ద్వారా వినతులు అందించారు. తమకు సొంత స్థలం ఉందని, ఇంటి నిర్మాణానికి సాయం చేయాలంటూ విన్న వించారు. ఇలా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 44,354 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18,500 మంది ఉన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 13,754, తూర్పుగోదావరిలో 12,200 దరఖాస్తులు వెల్లువెత్తాయి. మరో పది రోజుల్లో దరఖాస్తుల దాఖలుకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఇంకో నాలుగు వేల మంది వరకు వినతులు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మరో పక్క ఉమ్మడి జిల్లాలో నగరాభివృద్ధి సంస్థల పరిధిలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో నివాసం ఉంటూ సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి దాదాపు ఇళ్లు మంజూరైనట్లేనని అధికారులు చెబుతున్నారు. నగరాలు, పట్టణాల పరిధిలో ఇళ్లకు కేంద్రం నేరుగా ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నందున లబ్ధిదారులకు వేగంగా నిధులు రానున్నాయి.

95 శాతం స్థలం ఉన్నవారే..

దరఖాస్తుదార్లలో 95 శాతం మంది తమకు సొంతంగా ఇంటి స్థలాలు ఉన్నట్టు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో వీరికి సొంత స్థలం ఉన్నట్టు ఆయా మండలాల తహశీల్దార్లతో పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్లను అధికారులు తీసుకుంటున్నారు. ఇప్పటికే సగానికిపైగా దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియ ముగిసింది. మరో పక్క వచ్చిన దరఖాస్తుల్లో నిబంధనల ప్రకారం ఉన్న వాటిని లబ్ధిదారుల యాప్‌లో అధికారులు నమోదు చేస్తున్నారు. గతంలో వీరు ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రభుత్వం నుంచి స్థలం లేదా ఇళ్లు పొంది ఉన్నారా? లేదా? అనేది గుర్తించే ప్రక్రియ త్వరలో మొదలు పెట్టనున్నారు. అర్హుల జాబితాకు సంబంధించి వడపోత పూర్తయితే వాటిని కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లోను పట్టణం, గ్రామీణ ప్రాంతం విభాగంలో అప్‌లోడ్ చేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న ఒక్కో లబ్ధిదారుడు పథకానికి అర్హత సాధిస్తే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేయనుంది.ఇందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు. దరఖాస్తుదారులకు సొంత స్థలం ఉంటే సాధ్యమైనంత వేగంగా పథకం పురోగతి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తుదారులు భారీగా క్యూకట్టడంతో వేగంగా ఇళ్ల నిర్మాణాలు సాగేలా కనిపిస్తున్నాయి.

నెలాఖరు వరకూ అవకాశం..

పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. సచివాలయాల ద్వారా గతేడాది నవంబరు ఆఖరు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొంత స్థలం ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి నిధులు మంజూరు చేస్తామని తెలిపింది.ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 43,737 మంది దరఖాస్తులు చేసుకున్నట్టు అధికారులు తేల్చారు.అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో 3 వేలు, గోపాలపురం 1600,రాజానగరం మండలంలో 1,200 మంది వరకు పేదలు దరఖాస్తు చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా కాట్రేనికోన మండలంలో 1,024,ఉప్పలగుప్తం 1,006, ఐ.పోలవరం 904, అయినవిల్లి 859, అంబాజీపేట 850, అమలాపురం 846, అత్యల్పంగా మండపేటలో 67 దరఖాస్తులు వచ్చాయి.కాకినాడ అర్బన్ పరిధిలో అత్యధిక దరఖాస్తులు వచ్చాయి.ఈ నెలాఖరుతో దరఖాస్తుల గడువు ముగియనుంది.

పట్టణ ఇళ్లకు ఢోకా లేదు..

ఉమ్మడి జిల్లాలో కుడా, రుడా, అముదా పరిధిలోకి వచ్చే దరఖాస్తులకు సంబంధించి అర్హులకు దాదాపు ఇళ్లు మంజూరైనట్లేనని అధికారులు చెబుతున్నారు. వీటి పరిధిలో ఇళ్లకు పూర్తిగా కేంద్రమే నిధులు ఇవ్వనుంది. దీంతో నిధుల సమస్య వచ్చే అవకాశం లేదు. అటు గ్రామీణప్రాంతాల్లో ఇళ్లకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులు ఎక్కువగా అవసరం ఉంది. ఈ నేపథ్యంలో వీటి మంజూరుకు సైతం అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

నాడంతా అస్తవ్యస్తం

వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో పేదలను నిలువునా ముంచేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.06 లక్షల మందిని పేదల ఇళ్లస్థలాలకు అర్హులుగా గుర్తించింది. వీరందరికీ 7,610 ఎకరాలు అవసరమవుతాయని నిర్ధారించారు.రెండు వేల ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగిలిన 5,610 ఎకరాల ప్రైవేటు భూములను రూ.2,200 కోట్లకు పైగా వెచ్చించి కొనుగోలు చేసింది. అయితే పేదల ఇళ్లస్థలాలకు అనువైన ప్రాంతాలు కాకుండా కేవలం స్థానిక అధికార పార్టీ నాయకులకు ఆర్థికంగా కలిసి వచ్చే.. ఎందుకూ పనికిరాని భూములను అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో 1,540 వరకు లేఅవుట్లు వేశారు.ఇందులో వెయ్యికిపైగా లేఅవుట్ల వరకు వర్షాలకు తరచూ నిండా మునిగిపోయేవి.150 ఎకరాల కరప సెంట్రల్ లేఅవుట్ దగ్గర నుంచి,జగన్ ప్రారంభించిన కొమరగిరి లేఅవుట్,రాజమహేంద్రవరానికి సమీపంలోని ఆవ భూములు,మండపేట, రామచంద్రపురం, కడియం, పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట, గోకవరం,పెదపూడి ఇలా అనేక మండలాల్లో మునిగిపోయిన పరిస్థితి.వీటిలోనే లబ్ధిదారులు తమకు ఇచ్చిన పట్టాల్లో ఇళ్లు కట్టుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది.గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల పథకం అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు ఆ తప్పులు లేకుండా అధికారులు పథకాన్ని పక్కాగా అమలు చేయనున్నారు.లబ్ధిదారు లంతా ఇళ్లు కట్టుకునేలా పర్యవేక్షించనున్నారు.

థాంక్యూ సీఎం సార్!



చంద్రబాబు వచ్చారు..డీఎస్సీ ఇచ్చారు

- మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- ఉమ్మడి జిల్లాలో 1241 పోస్టులు
- ఏడేళ్ల తర్వాత విడుదల
- గత వైసీపీలో ఆ ఊసే లేదు
- అభ్యర్థుల ఆనందం

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)
ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులకు సీఎం చంద్రబాబు నాయుడు 75వ పుట్టిన రోజు సందర్భంగా ప్రత్యేక కానుక ఇచ్చారు. ఎన్నాళ్లగానో ఎదురుచూస్తున్న మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌ను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ఆదివారం విడుదల చేశారు.గత ఏడేళ్లుగా ఈ ప్రకటన కోసం ఉపాధ్యాయ నిరుద్యోగ అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 16,437 పోస్టుల భర్తీకి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. తూర్పుగోదావరి జిల్లాకు సంబంధించి స్కూల్ ఎడ్యుకేషన్ పోస్టులు 1241 భర్తీ చేయనుంది. వాస్తవానికి 2018లో డీఎస్సీ చివరి నోటిఫికేషన్ విడుదలైంది. తర్వాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం సుమారు ఆరు వేల పైచిలుకు పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చింది. దీంతో పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నారు. పోస్టుల సంఖ్య తక్కువగా ఉండడంతో అభ్యర్థులు ఆందోళన చేపట్టారు. ఈ నేపథ్యంలో వైసీపీ సర్కారు డీఎస్సీ పరీక్ష నిర్వహించలేదు. ఇంతలో ఎన్నికలు కోడ్ అమల్లోకి రావడంతో నియామక ప్రక్రియకు బ్రేక్ పడింది. 2024 ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినట్టుగానే సీఎం చంద్రబాబు అధికారంలోకి వచ్చిన వెంటనే తొలి సంతకం డీఎస్సీ పోస్టుల భర్తీ ఫైల్‌పై సంతకం చేశారు. ఇచ్చిన మాట ప్రకారమే.. సీఎం చంద్రబాబు ఆయన జన్మదినం రోజున డీఎస్సీ నోటిఫికేషన్‌పై విడుదల చేయడంపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్న చంద్రబాబు అంటూ పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. 'బాబు ష్యూరిటీ.. జాబు గ్యారంటీ' అని డీఎస్సీ అభ్యర్థులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 1241 ఉపాధ్యాయ పోస్టులను డీఎస్సీ ద్వారా భర్తీ చేయనున్నారు. స్కూల్ అసిస్టెంట్లకు సంబంధించి తెలుగు 65, ఫిజికల్ సైన్స్ 71, బయోలాజికల్ సైన్స్ 103, సోషల్ స్టడీస్ 132, వ్యాయామ విద్య 210, ఎస్జీటీలు డీఎస్సీ ద్వారా భర్తీ కానున్నాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ్‌కు సంబంధించి ఫిజికల్ సైన్స్ 3, బయోలాజికల్ సైన్స్ 4, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య 1 ఎస్జీటీలు 104, మొత్తం 112 ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయనున్నారు. ప్రత్యేక విద్యకు సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13 టీజీటీలు, మూడు పీఈటీలు, 15 ఎస్జీటీలతో కలిపి మొత్తం 31 పోస్టులు భర్తీకానున్నాయి.డీఎస్సీ అభ్య ర్థులు, నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నిరుద్యోగులకు ఊపిరిచ్చింది..



నేను 2005లో బీకాం బీఈడీ చేశా. ఇపుడు నా వయస్సు 41 ఏళ్ల. గతంలో రెండుసార్లు ప్రయత్నించా. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ మెగా నోటిఫి కేషన్ ఇవ్వడం బీఈడీ నిరుద్యోగులకు ఊపిరినిచ్చింది.
- ఇల్లూరి కామేశ్వరరావు, తాపేశ్వరం

మాట నిలబెట్టుకున్నారు..



2018లో చంద్రబాబు ప్రభుత్వంలో డీఎస్సీ తర్వాత ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. జగన్ ప్రభుత్వంలో నోటిఫికేషన్ ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. చంద్రబాబు మాట నిలబెట్టుకున్నందుకు చాలా సంతోషిస్తున్నాం.
- బూర్తి లోవకుమారి, వీకే రాయపురం



ఆదివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా రాజమహేంద్రవరం దేవిచౌక్ సెంటర్

ఉక్కిరిబిక్కిరి!

- మండిపడిన భానుడు
- ఉక్కబోతతో సతమతం

రాజమహేంద్రవరం సిటీ,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భానుడు రోజు రోజుకు తన ప్రతాపం చూపుతున్నాడు.. ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు మండిపోతున్నాయి. అత్యధికంగా 39.0 - 40 డిగ్రీల మధ్య ఎండలు కాస్తున్నాయి. ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠంగా 40.5 కనిష్ఠంగా 25.5 డిగ్రీలు నమోదైంది. గాలిలో తేమ లేకపోవడంతో ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 10 గంటల నుంచే సూరీడు మండిపడ్డాడు. జనం బయటకు రావాలంటేనే భయపడిపోయారు.మధ్యాహ్నం 12 గంటల సమయానికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి.ఆదివారం సెలవు రోజైన ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎండ వేడిమికి ఏసీల వినియోగం పెరిగింది.ఏసీ అవుట్‌డోర్ యూనిట్స్ నుంచి వచ్చిన వేడిగాలులతో ఉష్ణో గ్రతలు పెరిగాయి.ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎలావుంటుందో అని ప్రజలు ఆందోళనలో పడ్డారు.గోదావరి బండ్ రోడ్డు సాయంత్రం ఊరటగా కనిపించింది.

నేడు డీఆర్‌సీ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగే సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త పెందుర్తి వెంకటేష్ హాజరు కానున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ప్రధానంగా 8 అంశాలపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుతో సమీక్షిరు. ప్రధానంగా సమ్మర్ వాటర్ సప్లయి,విజన్ ప్లాన్స్, ప్రొక్యూర్‌మెంట్, ఇసుక యాక్షన్ ప్లాన్, ప్రైమరీ సెక్టార్‌లో అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక , మత్స్య శాఖలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుతీరు, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, పాఠశాల విద్యా తదితర అంశాలపై ఇన్‌చార్జి సమీక్ష నిర్వహించనున్నారు.

నేడు పీజీఆర్ఎస్

జిల్లాలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజనల్, మండల కేంద్రాలు, పురపాలక కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహిస్తామన్నారు.

వరి'ఖరీ'యే!





సగమే సర్కారు కొనుగోలు.. మిగిలిన సగం మాటేమిటి..

- 58,586 హెక్టార్లలో సాగు
- దిగుబడి 5 లక్షల టన్నులు
- కొనుగోళ్లు 2.5 లక్షల టన్నులు
- మిగిలిన రైతుల లబోదిబో
- మా ధాన్యం కొనాలని డిమాండ్
- రాజానగరంలో రైతుల గగ్గోలు
- దళారులను ఆశ్రయిస్తున్న వైనం
- జిల్లాలో 28 శాతం కోతలు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)
పంట పండింది.. దిగుబడి బాగుంది.. ఆ పంటను ఏం చేయాలనే దానిపై అయోమయం నెలకొంది. కొంత మంది దళారులను ఆశ్రయిస్తుంటే.. మరికొంత మంది ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తున్నారు. పండించిన మొత్తం ధాన్యం పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేయకపోవడంతో చాలా మంది రైతులు బ్రోకర్లు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మంచి ధర లభిస్తున్నా మొత్తం ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి అక్కడా లేదు.జిల్లాలో 58,586 హెక్టార్లలో రబీలో వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ఆరంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 5 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవు తుందని వ్యవసాయశాఖ అంచనా.అయితే 2.5 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో సుమారు 200లకు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటా కామన్ రకం ధాన్యం ధర రూ.2300, అదే గ్రేడ్-ఎ రకం ధర రూ.2,340గా ఉంది.75 కేజీల బస్తా రూ.1720 వరకూ కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం సాగు చేసిన పంటనంతా కొనుగోలు చేసే పరిస్థితి లేక పోవ డంపై ఆందోళన చెందుతున్నారు. పండించిన పంటనంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాజానగరం మండల పరిధిలోని రెండు గ్రామాల్లో ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు చేయలేదు..అయితే టార్గెట్ పూర్తయిపోయిందని అధికారులు చెప్పడంతో తమ ధాన్యం ఎక్కడ అమ్ముకోవా లని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ రైతులంతా దళారులు, రైస్ మిల్లర్ల కు అమ్ముకునేవారు. వారు ఎంత ఇస్తే అంత అనే విధంగా ఉండేది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధిక ధర ఇవ్వ డంతో పాటు 48 గంటల్లోపే రైతు ఖాతాల్లో డబ్బులు జమ వుతుండడం వల్ల మిగతా ధాన్యం కొనుగోలు చేయాలని కోరడం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకూ 5,732 ఎఫ్‌టీవోలకు రూ.116 కోట్లు జమ చేశారు.



కోతలు జోరు..

జిల్లాలో కోతలు జోరందుకున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటికి 28శాతం పూర్తయ్యాయి.నెలాఖరుకి మరో 40శాతం పూర్తవుతాయని..మే మొదటి వారంలో మొత్తం కోతలు పూర్తవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు తెలిపారు.18 మండలాల్లో మొత్తం 60042 హెక్టార్లలో ఆయకట్టు ఉండగా 58,586 హెక్టార్లలో వరిసాగు చేశారు. అనపర్తి, ఉండ్రాజవరంలో తక్కువగా కోతలు జరిగాయి. రాజమండ్రి రూరల్‌లో 77.6 శాతం, కడియంలో 7.4 శాతం,రాజానగరంలో 38.4 శాతం, అనపర్తి 1.0 శాతం,బిక్కవోలు 9.2 శాతం, కోరుకొండ 38.9 శాతం,గోకవరం 36.1 శాతం, సీతానగరంలో 54 శాతం,రంగంపేట 48.3 శాతం, చాగల్లులో 37.8శాతం,దేవరపల్లి 34 శాతం, గోపాలపురం 11.8 శాతం, కొవ్వూరు 56.4 శాతం, నిడదవోలు 43.8 శాతం,పెరవలి 13.7 శాతం, తాళ్లపూడి 15.3 శాతం,ఉండ్రాజవరం 2.1శాతం, నల్లజర్ల 28.8 శాతం కోతలు జరిగాయి.

ఆ రెండు గ్రామాల ధాన్యం కొనేదెవరు?

దివాన్‌చెరువు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం ఇంకా మా కళ్లాల్లోనే ఉంది.. ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం ఎలా పూర్తయ్యిందో అర్థం కావడంలేదని రాజానగరం మండలంలోని పాత తుంగపాడు, కొత్తతుంగపాడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తతుంగపాడులో రైతు సేవా కేంద్రం వద్ద వెళ్లి ధాన్యం కొనుగోలు చేయమని కోరగా లక్ష్యం పూర్తయ్యిందని చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని పాతతుంగపాడు, కొత్తతుంగపాడు రెండు గ్రామాలను కలిపి కొత్తతుంగపాడు క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాల్లో 1100 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 3600 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రానికి వెళ్లగా అధికారులు ధాన్యం కొనుగోళ్లు పూర్తయిపోయాయంటూ చల్లగా చెప్పిన కబురుతో తీవ్ర నిరాశ చెందారు. దీంతో రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమగోడు చెప్పుకున్నామని రైతు లు ఉంగరాల ఆదినారాయణ, నాగేశ్వరరావు తదితరులు తెలిపారు.మా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కాస్త ఆలోచించండి!



ఆత్రేయపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఉభయగోదావరి జిల్లాలకు వారధిగా ఉన్న కాటన్ బ్యారేజీ వద్ద సాయంసంధ్య సమయంలో పర్యాటకుల సందడి ఎక్కువగా ఉంటుంది. వేసవి సెలవులు కావడంతో అధికసంఖ్యలో విద్యార్థులు బ్యారేజీ వద్దకు వస్తున్నారు. ఇక్కడ వరకు బానే ఉంది కానీ కొందరు మాత్రం మోటార్‌సైకిళ్లు వేసుకుని అడ్డుకట్ట వద్ద రేస్‌లను నిర్వహిస్తున్నారు. ప్రమాదమని తెలిసినా పర్యాటకులు స్నానాలు ఆచరించడం మానడంలేదు. ప్రతి ఏడాది వేసవిలో పదుల సంఖ్యలో గోదావరిలో పడి మృత్యువాత పడుతున్నారు. సరదా కాస్తా విషాదాన్ని మిగిలిస్తుంది. వేసవి ఆరంభంలో పోలీసులు బొబ్బర్లంక సమీపంలోని బ్యారేజీ వద్ద స్నానాలు ఆచరించకుండా నిరోధించారు. కానీ సమీప ప్రాంతంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయ్యలేదు. పోలీస్ పహరా కూడా లేకపోవడంతో వేలాదిమంది పర్యాటకులు స్నానాలకు వస్తున్నారు తప్ప ప్రమాదం కూడా పొంచి ఉందనే విషయాన్ని మరిచిపోతున్నారు.

కాటన్ బ్యారేజీ వద్ద గోదావరిలో స్నానాలు ఆచరిస్తున్న పర్యాటకులు

విహారయాత్రకు వెళ్లి...

సీలేరు నదిలో ఇద్దరు యువకుల గల్లంతు



సీలేరు నది ఒడ్డున పరిస్థితిని సమీక్షిస్తున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా



సుగ్రీవ శ్రీను (ఫైల్)



నాగుల దిలీప్ (ఫైల్)

చింతూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా సీలేరు నదిలో ఆదివారం సాయంత్రం ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. వివరాల ప్రకారం.. చింతూరుకు చెందిన ఆరుగురు యువకులు విహారయాత్రలో భాగంగా చింతూరు మండలం కల్లేరు సమీపంలోని సీలేరు నది ఒడ్డుకు వెళ్లారు. వారిలో సుగ్రీవ శ్రీను (25), నాగుల దిలీప్ (25) ప్రమాదవశాత్తు ఉధృతంగా ప్రవహిస్తున్న సీలేరు నదిలో గల్లంతయ్యారు. ఈ విషయాన్ని మిగిలిన నలుగురు పోలీసులకు తెలిపారు. విషయం తెలుసుకున్న చింతూరు ఐటీడీఏ పీవో అపూర్వ భరత్, ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, ఎస్ఐ రమేష్ తదితరులు ఘటనా ప్రదేశానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చీకటి పడడంతో గల్లంతైన వారి ఆచూకీ కోసం చేపట్టే ప్రయత్నాలకు ప్రతికూల పరిస్థితి ఏర్పడిందని, దీంతో సోమవారం ఉదయం కూడా గాలింపు చేపట్టనున్నట్టు ఎస్ఐ రమేష్ ఆంధ్రజ్యోతికి తెలిపారు.

ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితా ప్రచురణ

అభ్యంతరాల స్వీకరణ

కాకినాడ రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ ఆదేశాల మేరకు ఆర్జేడీ కాకినాడ పరిధిలోని ప్రభుత్వ యాజమాన్యాల్లోని ఎస్ఏల సాధారణ సీనియారిటీ జాబితాను టిస్ ఆధారంగా రూపొందించి వచ్చిన అభ్యంతరాల ప్రకారం జాబితాను తయారు చేశారు. ఆ జాబితాను www.rjdsekkd.org వెబ్‌సైట్‌లో సంబంధిత ఉమ్మడి తూర్పు గోదావరి, ఉమ్మడి పశ్చిమ గోదావరి, ఉమ్మడి కృష్ణా జిల్లా విద్యా శాఖల వెబ్‌సైట్‌లు, నోటీసు బోర్డుల్లో అందుబాటులో ఉన్నాయని ఆర్జేడీ జి.నాగమణి తెలిపారు. సీనియారిటీ జాబితాపై ఏమైనా అభ్యంతరాలుంటే సోమవారం లోపు సంబంధిత ఉమ్మడి జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో సమర్పించాలన్నారు.

దళితుల సాంఘిక బహిష్కరణ

కాకినాడ జిల్లా మల్లాంలో ఉద్రిక్త పరిస్థితులు



మల్లాం గ్రామంలో అధికారులకు ఫిర్యాదు చేస్తున్న దళితులు, దళిత సంఘాల ప్రతినిధులు

పిఠాపురం/పిఠాపురం రూరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం మండలం మల్లాంలో దళితులు సాంఘిక బహిష్కరణకు గురయ్యారు. ఈ విషయంలో వెలుగులోకి రావడంతో గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. గ్రామంలో అధికారులు పర్యటించారు. ఇరువర్గాలతో శాంతికమిటీ ఏర్పాటు చేశారు. పరిస్థితి నియంత్రణలోనే ఉందని కలెక్టర్ ప్రకటించారు. పిఠాపురం మండలం మల్లాంలో కొద్ది రోజులుగా జరుగుతున్న పరిణామాల నేపథ్యంలో దళితులను సాంఘిక బహిష్కరణ చేయడం ఉద్రిక్తతలకు దారి తీసింది. గ్రామంలోని ఒక ఇంటిలో ఎలక్ట్రికల్ పనులు నిమిత్తం వెళ్లిన పల్లపు సురేష్‌బాబు కరెంట్ షాక్‌కు గురై మరణించాడు. దీనికి గాను ఇంటి యజమాని జల్లి బాబు రూ.10లక్షల పరిహారం చెల్లించాలని దళిత సంఘాలు డిమాండ్ చేయడంతో పాటు అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆందోళన నిర్వహించారు. అనంతరం పిఠాపురం సీఐ సమక్షంలో జరిగిన చర్చల్లో రూ.2.75లక్షలు పరిహారం ఇచ్చేందుకు ఒప్పందం కుదిరింది. ఈ సంఘటన తర్వాత అగ్రవర్ణాలు జరుగుతున్న పరిణామాలపై చర్చించుకున్నారు. ఇటీవల జరిగిన సంఘటనలను ప్రస్తావిస్తూ దళితులను పనుల్లోకి రానివ్వకూడదని నిర్ణయించుకున్నారు. ఆదివారం ఉదయం గ్రామంలో చికెన్ షాపులు, హోటళ్లకు వెళ్లిన దళితులకు మాంసం, టిఫిన్లు విక్రయించలేదు. పొలాలు, ఇతర పనులను దళితులకు అప్పగించలేదు. దీంతో దళితులను సాంఘిక బహిష్కరణ చేసిన విషయం వెలుగులోకి వచ్చింది.

అధికారుల పర్యటన

మల్లాంలో ఆదివారం కాకినాడ ఆర్డీవో మల్లిబాబు, వికాస ప్రాజెక్టు డైరెక్టర్ లచ్చారావు, పిఠాపురం సీఐ శ్రీనివాస్, రూరల్ ఎస్ఐ జానీబాషా పర్యటించారు. పరిస్థితిని సమీక్షించారు. తమను సాంఘిక బహిష్కరణకు గురి చేయడం, తర్వాత జరిగిన సంఘటనలు గురించి దళితులు వారికి వివరించారు. దళితులను సాంఘిక బహిష్కరణకు గురిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలని అంబేడ్కర్ యువజన సంఘం, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం ప్రతినిధులు కోరారు.

శాంతికమిటీ ఏర్పాటు

మల్లాంలో పరిస్థితులపై జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ సమీక్షించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఆదివారం సాయంత్రం పిఠాపురం తహశీల్దార్ కార్యాలయంలో కాకినాడ ఆర్డీవో మల్లిబాబు ఇరువర్గాల ప్రతినిధులతో శాంతికమిటీ ఏర్పాటు చేసి చర్చించారు. భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని సూచించారు. దళితులు, అగ్రవర్ణాలు సామరస్యంగా మెలగాలని సూచించారు. సాంఘిక బహిష్కరణ వంటి అంశాలు జరిగితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. చర్చల్లో సీఐ, తహశీల్దారు గోపాలకృష్ణ, పెద్దాపురం ఏఎస్‌డ్బ్యూవో వాణి పాల్గొన్నారు. కాగా మల్లాంలో పరిస్థితి పూర్తి నియంత్రణలో ఉందని కలెక్టర్ ప్రకటించారు. అక్కడ ఎలాంటి ఉద్రిక్తతలు లేకుండా అన్నిచర్యలు తీసుకున్నామని తెలిపారు.

తెల్లవారితే వివాహ నిశ్చితార్థం.. కానీ అంతలోనే విషాదం..

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య



వెంకటేష్ (ఫైల్‌ఫొటో)

పిఠాపురం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): పెళ్లి కుదిరింది. ఆదివారం వివాహ నిశ్చితార్థం జరగాల్సి ఉంది. అందుకు గంటల ముందుగా ఆ యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన వారి బంధువులు, కుటుంబసభ్యుల్లో విషాదం నింపింది. కాకినాడ జిల్లా పిఠాపురం వేణుగోపాలస్వామి గుడి వీధికి చెందిన వింజమూరి వెంకటేష్ అనే వెంకీ (30) పౌరోహిత్యం చేస్తున్నాడు. ఇతడికి ఇటీవలే పెళ్లి కుదిరింది. ఆదివారం నిశ్చితార్థం, బుధవారం వివాహం జరగాల్సి ఉంది. ఇంతలో ఏమి జరిగిందో తెలియదు కాని శనివారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని గోర్స రైల్వే గేటు సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం మృతదేహాన్ని రైల్వే ట్రాక్‌పై స్థానికులు గుర్తించారు. ఈ సంఘటన తెలియడంతో కుటుంబసభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. నిశ్చితార్థానికి గంటల ముందు ఆత్మహత్య చేసుకోవాల్సిన అవసరం ఏమి వచ్చిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలాఉండగా శనివారమే పెళ్లి పనుల నిమిత్తం రూ.2లక్షలు బ్యాంకు నుంచి వెంకీ డ్రా చేశాడు. అతడి సోదరుడు కాకినాడలోని బ్యాంకు ఉద్యోగి కాగా తల్లిదండ్రులు ఉన్నారు. ఆత్మహత్య చేసుకోవడానికి గల కారణాలపై సామర్లకోట రైల్వే పోలీసులతో పాటు పిఠాపురం పట్టణ పోలీసులు విచారణ జరుపుతున్నారు.

తిరుమల ఘాట్‌రోడ్డులో కారు దగ్ధం

రావులపాలెం భక్తులు సురక్షితం



దగ్ధమవుతున్న కారు

రావులపాలెం, ఏప్రిల్ 2(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెంకు చెందిన కొవ్వూరి సతీష్‌రెడ్డి, తాడి ఉపేంద్రవెంకటరెడ్డి, వై.సూర్యనారాయణ, వై.సుబ్బారావులు శనివారం రాత్రి తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి కారులో బయలుదేరారు. ఆదివారం ఉదయం కారు తిరుమల కొండ ఎక్కుతుండగా మోకాళ్ళ పర్వతం వద్దకు వచ్చేసరికి ముందు భాగం నుంచి పొగలు వస్తుండటంతో భక్తులు కారు ఆపి బయటకు పరుగులు తీశారు. క్షణాల వ్యవధిలోనే కారులో నుంచి మంటలు చేలరేగి కారు అగ్నికి ఆహుతైంది. భక్తులందరూ సురక్షితంగా బయటపడగా అక్కడ వాహనదారులు ఇక్కడి బంధువులు ఊపిరిపీల్చుకున్నారు.

సత్యదేవునికి రూ.3.50 లక్షల విలువైన నూతన పట్టువస్త్రాల బహూకరణ



సత్యదేవుని వార్షిక కల్యాణానికి దాత అందించిన పట్టువస్త్రాలతో ఈవో, చైర్మన్

అన్నవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రత్నగిరివాసుడైన సత్యదేవుని వార్షిక కల్యాణోత్సవాలు వచ్చే నెల 7నుంచి ప్రారంభంకానుండగా 8వ తేదీ రాత్రికి దివ్యకల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ సందర్భంగా స్వామి,అమ్మవార్లకు, సీతారాములు, వనదుర్గ, కనకదుర్గలకు విజయవాడకు చెందిన రావాడ చిరంజీవిరావు దంపతులు సుమారు రూ.3.50 లక్షలు విలువ చేసే పట్టువస్త్రాలను ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్‌లకు అందజేశారు. దాతను వారు అభినందించారు. జంగారెడ్డిగూడెనికి చెందిన వి.రాము కల్యాణోత్సవంలో వినియోగించేందుకు గోటితో ఒలిచిన తలంబ్రాలను అందజేశారు. స్వామి సన్నిధిలో వారాంతపు ఆర్జితసేవ అయిన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది.

కల్యాణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

వచ్చే నెల 7నుంచి ప్రారంభమయ్యే స్వామి వారి దివ్యకల్యాణోత్సవాలకు విస్తృత ప్రచారం కల్పించడంలో భాగంగా పోస్టర్‌ను ఆదివారం ఈవో సుబ్బారావు, చైర్మన్ రోహిత్, దేవస్థానం పండితులు,ఇతర అధికారులు ఆవిష్కరించారు.

పలు ఆర్జితసేవలు రద్దు

స్వామివారి వార్షిక కల్యాణోత్సవాల సందర్భంగా దేవస్థానంలో పలు ఆర్జితసేవలను తాత్కాలికంగా రద్దుచేయనున్నట్లు ఆలయ అధికారులు వెల్లడించారు. ప్రధానంగా నిత్యకల్యాణాలు, ఆయుష్యహోమం, చండీహోమం, ప్రత్యంగిర హోమం, సహస్ర దీపాలంకరణ, పంచహారతుల సేవలను నిలుపుదల చేస్తున్నామన్నారు.

భీమేశ్వరస్వామికి 108 బంగారు పుష్పాలు సమర్పణ



బంగారు పుష్పాలను ఆలయ ఈవోకు అందచేస్తున్న గంగిరెడ్డి




బంగారు పుష్పాలు

ద్రాక్షారామ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ద్రాక్షారామ భీమేశ్వరస్వామి వారికి రాయవరం మండలం చెల్లూరుకు చెందిన సత్తిగం గిరెడ్డి దంపతులు 21 గ్రాములతో చేసిన 108 బంగారు పుష్పాలను సమర్పించారు. ఆదివారం చెల్లూరు రాజరాజేశ్వరి మోడరన్ రా అండ్ బాయిల్డ్ రైసు మిల్లు అధినేత సత్తిగం గిరెడ్డి, భాగ్యలక్ష్మీ దంపతులు 108 బంగారు పుష్పాలను ఆలయ సహాయ కమిషనర్ అల్లువెంకట దుర్గాభవానీకి అందచేశారు.

తమ్ముడికి ఫోన్ చేసి.. గోదావరిలో దూకేసి

ఓఎన్‌జీసీ డ్రైవర్ ఆత్మహత్య



మదన్ కిషోర్ (ఫైల్‌ఫొటో)

రాజమహేంద్రవరం సిటీ ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం ఆర్టీసీ కాలనీకి చెందిన ఓఎన్‌జీసీ తాత్కాలిక డ్రైవర్ సుంకర మదన్‌కిషోర్ (45) కొవ్వూరు గోదావరిలో దూకి ఆత్మహత్య చేసుకున్నాడని ప్రకాష్‌నగర్ పోలీసులు తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం... మదన్ కిషోర్ రాజమహేంద్రవరం ఓఎన్‌జీసీలో కాంట్రాక్టు పద్ధతిలో డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. శనివారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వచ్చిన కిషోర్ కొవ్వూరు గోదావరికి చేరుకుని అక్కడ నుంచి తన తమ్ముడికి ఫోన్ చేసి తాను గోదావరికి వచ్చానని ఒకసారి అమ్మతో మాట్లాడాలని చెప్పాడు. నువ్వు వెంటనే ఇంటి వచ్చేయ్ అప్పుడు అమ్మతో మాట్లాడుదువుగాని అని తమ్ముడు సమాధానం చెప్పడంతో కిశోర్ ఫోన్ కట్ చేశాడు. అటుపై గోదావరి రేవులో వెతికిన కిషోర్ కుటుంబసభ్యులు రాజమహేంద్రవరం ప్రకాష్‌నగర్ పోలీసులను ఆశ్రయించడంతో కేసు నమోదు చేశారు. ఆదివారం కొవ్వూరు గోదావరి రేవులో తేలిన మృతదేహం మదన్ కిషోర్‌గా గుర్తించి ఆత్మహత్య కేసుగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ దుర్గాశ్రీనివాస్

అంతర్వేది, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది దేవస్థానం ఐవీసీ చర్చి ఎదురుగా ప్రధాన రహదారిపై కారు ఢీకొని బోనం బాపిరాజు (49) మృతిచెందినట్టు పోలీసులు తెలిపారు. ఎస్ఐ కె.దుర్గాశ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు.. పాశర్లపూడి గ్రామానికి చెందిన బాపిరాజు ఎక్సెల్ బైక్‌పై నిమ్మకాయల వ్యాపారి. ఆదివారం అంతర్వేది దేవస్థానం నుంచి ఇంటికి వెళ్తుండగా రావులపాలెం నుంచి అంతర్వేది గుడికి వెళ్తున్న హోండా ఎమెన్ కారు బలంగా ఢీకొంది. వెంటనే ఎయిర్ బ్యాగులు ఓపెన్ అయి రహదారి కనిపించకపోవడంతో ఎగిరి బోనెట్‌పై పడిన బాపిరాజును 10 మీటర్ల దూరం ఈడ్చుకుని వెళ్లడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాశ్రీనివాస్ తెలిపారు. బాపిరాజుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

పొగాకు కొనట్లేదని బేళ్లకు నిప్పు



రాజవొమ్మంగి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రైతుల నుంచి పొగాకును ఎంఎల్ కంపెనీ వ్యక్తులు కొనట్లేదనే కారణంగా ఆదివారం రాజవొమ్మంగి మండలం బరదనాంపల్లి రైతులు ఆందోళన చేశారు. ఓ రైతు తన పొగాకు బేళ్లకు నిప్పు పెట్టి అసంతృప్తి వ్యక్తం చేశాడు. గిట్టుబాటు ధర కోసం డిమాండ్ చేయట్లేదు, ఒక రూపాయి అయిన ఇచ్చి కొనండి అంటూ రైతులు విజ్ఞప్తి చేసినా సిబ్బంది స్పందించలేదు. రైతులు తీవ్రస్థాయిలో ఆందోళన చేసేందుకు సిద్ధంకావడంతో చేసేదేది లేక ఉన్న పొగాకు బేళ్లను సిబ్బంది కొని తీసుకువెళ్లారు.

కొట్లాట సంఘటనపై కేసులు

కొవ్వూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు కొట్లాట సంఘటనపై కేసులు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం పంగిడి గ్రామానికి చెందిన కాసాని సున్నీ బైక్ స్పీడుగా నడుపుతూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. గతంలో హెచ్చరించిన తీరు మార్చుకోలేదు. ఈనెల 19న రాత్రి సున్నీ మళ్లీ బైక్ స్పీడుగా నడుపుతూ వెళ్తుండగా ఆకుల ప్రసన్న సీతష్‌కుమార్ అడ్డుకుని ప్రశ్నించాడు. దీంతో సున్నీ ఇంటికి వెళ్లి తండ్రి కొండలరావుతో వచ్చి సతీష్‌కుమార్‌తో ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వాసుపత్రిలో చేరారు. ఆసుపత్రి సమాచారం మేరకు ఇద్దరిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఏపీ ఎన్జీవో ఉమ్మడి జిల్లా అసోసియేషన్

కో-ఆప్షన్ కార్యవర్గ ప్రమాణస్వీకారం

కాకినాడ సిటీ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): ఏపీ ఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కో-ఆప్షన్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం ఆదివారం ఘనంగా జరిగింది. కాకినాడ ఎన్జీవో హోంలో జిల్లా అధ్యక్షుడు గుద్దటి రామ్మోహనరావు అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ కో-ఆప్షన్ సభ్యులుగా నియమితులైన జిల్లా ఉపాధ్యక్షురాలు ఎస్.విజయ భారతి, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి వై.రామకృష్ణ, జిల్లా సంయుక్త కార్యదర్శి టి.చార్లెస్‌పాల్, ట్రెజరీ ఉద్యోగి వి.శశికుమార్ ప్రమాణం చేశారు. పరిశీలకులుగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డీవీ రమణ, రాష్ట్ర సమాచార కార్యదర్శి జానకి హాజరు కాగా ముఖ్య అతిథిగా ఎన్జీవో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాస్ విచ్చేశారు. పలు అంశాలను చర్చించి తీర్మానాలు చేశారు. పీఆర్సీ వేసి ఐఆర్ వెంటనే చెల్లించాలని, హెల్త్ కార్డులు, పెండింగ్‌లో ఉన్న బకాయిలు, ఎరన్డ్‌లీవ్ ఎన్‌క్యాష్‌మెంట్ చెల్లింపు తదితర డిమాండ్లను నెరవేర్చకపోతే రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు ఆందోళన చేపట్టేందుకు అన్ని యూనిట్ల అధ్యక్ష, కార్యదర్శులు, సభ్యులు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పేపకాయల వెంకటకృష్ణ, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు పాలపర్తి మూర్తిబాబు, సరెళ్ల చంద్రరావు, పాండురంగారావు, కోశాధికారి వై.పద్మమీనాక్షి తదితరులు పాల్గొన్నారు.



కో-ఆప్షన్ సభ్యులతో ప్రమాణం చేయిస్తున్న జిల్లా నేతలు

కోటసత్తెమ్మకు బంగారం, వెండి బహూకరణ



ప్రత్యేక అలంకరణలో కోటసత్తెమ్మ

నిడదవోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తిమ్మరాజుపాలెం గ్రామంలో వేంచేసిన కోట సత్తెమ్మ అమ్మవారికి ఆదివారం పలువురు భక్తులు బంగారం, వెండి, నగదు విరాళాలు అందించినట్టు దేవస్థానం సహాయ కమి షనర్, ఈవో వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు. కె.పెంటపాడుకు చెందిన బీర్లవెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులు అమ్మవారికి 14 గ్రాముల 770 మిల్లి గ్రాముల బంగారం, రాజమండ్రికి చెందిన వానపల్లి మురళీకృష్ణ కుటుంబ సభ్యులు 400 గ్రాముల వెండి అష్టలక్ష్మి చెంబు, నిడదవోలుకు చెందిన చవ్వాకుల నాగ మల్లిఖార్జునరావు, సాయి కుమారి దంపతులు అమ్మవారి ఆలయంలో అన్నదానానికి రూ.25 వేల విరాళం అందించినట్టు పేర్కొన్నారు. దేవస్థానం ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవి శంకర్ పాల్గొన్నారు. అమ్మవారిని ఆదివారం భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకున్నారు. రూ.1,70,094 ఆదాయం లభించింది.



అమ్మవారికి బంగారం అందిస్తున్న వెంకటసత్యనారాయణ కుటుంబం

పరువుపోతుందని.. ప్రాణం తీశాడు!

మహిళను హత్య చేసిన వ్యక్తి అరెస్టు

అనుమానాస్పద మృతి కేసును ఛేదించిన బొమ్మూరు పోలీసులు

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం దివాన్‌చెరువు శ్రీరాంపురం ఫారెస్ట్‌లో నిర్మాణంలో ఉన్న సబ్‌స్టేషన్ వద్ద ఈనెల 15న పూర్తిగా పాడైపోయిన మహిళ మృతదేహాన్ని గుర్తించిన బొమ్మూరు పోలీసులు ఈ కేసును ఛేదించి నిందితుడిని అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఈనెల 15న దివాన్‌చెరువు వీఆర్వో రామ్‌జోగి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సబ్‌స్టేషన్ వద్ద పాడై పడిఉన్న మహిళ మృతదేహాన్ని పరిశీలించి ప్రభుత్వాసుపత్రి మార్చురీకి తరలించి అనుమానాస్పద మృతిగా బొమ్మూరు పోలీసులు కేసు నమోదు చేశారు. దీనిపై సమగ్ర దర్యాప్తు చేపట్టిన బొమ్మూరు సీఐ విశ్వనాధం ఆ మహిళ రాజమహేంద్రవరం నారాయణపురానికి చెందిన పలివెల మార్తమ్మ అలియాస్ పోలవరపు మార్త(31)గా గుర్తించారు. అంతకుముందు ఆమె ఈనెల 3 నుంచి కనిపించడంలేదని కుటుంబసభ్యులు స్థానిక వన్‌టౌన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో వివరాలు సేకరించిన బొమ్మూరు పోలీసులు ఆమె ఫోను కాల్ డేటా సేకరించి చివరిగా ఆమె స్థానిక అన్నపూర్ణంపేటకు చెందిన నిమ్మాదుల జ్యోతి సాయిశంకర్ అలియాస్ సాయితో మాట్లాడినట్టు గుర్తించి అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా తనకు ఆమెతో వివాహేతర సంబంధం ఉన్నట్టు పోలీసులకు తెలిపాడు. ఇటీవల తనను డబ్బుల కోసం మార్తమ్మ బెదిరించి డబ్బులు ఇవ్వకపోతే మన మధ్య ఉన్న సంబంధం నీ భార్యకు, కుటుంబానికి చెబుతానని బెదిరించడంతో పరువుపోతుందని భావించి ఎలాగైనా ఆమె అడ్డు తొలగించుకోవాలని ఈనెల 3న మార్తమ్మను శ్రీరాంపురం రోడ్డులోకి తీసుకెళ్లి కర్రతో కొట్టి చంపినట్టు సాయిశంకర్ ఇచ్చిన స్టేట్‌మెంట్ ఆధారంగా కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు పేర్కొన్నారు. కేసును ఛేదించిన పోలీసులను ఎస్పీ నరసింహకిషోర్ అభినందించారు.

పాఠశాల నుంచి అక్రమంగా నిత్యావసరాల తరలింపు

ఆటోతో సహా ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్న పోలీసులు

రంపచోడవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రంపచోడవరంలోని గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాల నుంచి అక్రమంగా తరలిస్తున్న 10 బస్తాల బియ్యం, 2 బస్తాల కందిపప్పు, బస్తా గోధుమ పిండి ఒక ఆటోతో సహా ఆదివారం పట్టుబట్టాయి. పాఠశాలలోని వార్డెన్ సూచనలతో వాటిని తరలించేందుకు ముగ్గురు ఆసాములు పాఠశాలకు వచ్చి వాటిని ఆటోలో ఎక్కించుకుని తరలించుకుపోతున్న తరుణంలో టిఎన్ఎస్ఎఫ్ నాయకుడైన దూడ ప్రణీత్ వీడియోలతో సహాయ వైరల్ చేశారు. దీంతో నిత్యావసరాలు, ఆటోతో సహా ముగ్గురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రంపచోడవరం పోలీసులు విచారణ జరుపుతున్నారు. ఈ ఘటనపై ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం స్పందించి తక్షణం వార్డెన్ క్రిష్ణాబాయిని సస్పెండ్ చేసినట్టు పేర్కొన్నారు.



కడియంలో చంద్రబాబు పుట్టినరోజు సందర్భంగా కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే గోరంట్ల

కూటమి రైతుల పక్షపాతి : ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, ఏప్రిల్20(ఆంధ్రజ్యోతి): కడియంలో ఎంపీపీ ప్రసాద్, వెలుగుబంటి నాని ల ఆధ్వర్యంలో జరిగిన చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతి అన్నారు. ధాన్యం విక్రయించిన 24 గంటలలోపు వారి ఖాతాలకు సొమ్ములు జమవుతున్నాయన్నారు. రైతుల కోసం కూటమి ప్రభుత్వం అనేకపథకాలు ప్రవేశపెట్టి వారి సంక్షేమానికి పాటు పడుతుందన్నారు.

చంద్రబాబు మా కష్టాలు స్వయంగా చూశారు

మా కష్టాలు చూసారు. మేమున్నామంటూ భరోసా ఇచ్చారు. అందుకే ఈవిధంగా ధాన్యంతో చంద్రబాబునాయుడుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాం. గతంలో సీఎం చంద్రబాబు నాయుడు కడియం వచ్చారని, అపుడు స్వయంగా మా కష్టాలు చూశారు. మా బాధలు విన్నారు. కూటమి ప్రభుత్వం రాగానే రైతులకు మేలు చేస్తాను అంటూ ధీమా ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం 24 గంటలలోపు, ఒకేసారి ధాన్యం విక్రయించి మిల్లుకు వెళ్ళి వేలిముద్ర వేసి ఇంటికి వెళ్లేలోపు ధాన్యం సొమ్ములు వస్తున్నాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత రైతుల సంక్షేమంకోసం పాటు పడుతున్న చంద్రబాబునాయుడు రూపాన్ని మా పంట పొలాల్లో పండిన ధాన్యంతో తీర్చిదిద్దడం ఎంతో సంతోషంగా ఉంది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మోసిగంటి సత్యవతి, టీడీపీ రాష్ట్ర నాయకులు, ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, మండల టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, టీడీపీ రాష్ట్ర రైతు ఉపాధ్యక్షులు మార్గాని సత్యనారాయణ, చెల్లుబోయిన శ్రీనివాసరావు, వ్యవసాయమార్కెట్ కమిటీ ఛైర్మెన్ మార్ని వాసుదేవరావు, వరగోగుల వెంకటేశ్వరరావు, రైతులు వెలుగుబంటి కొండ్రాజు, ఆకుల నాగబాబు, తోట శ్రీను, తామెళ్ళ వేంకటేశ్వరరావు, వారణాసి గోవిందు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, రైతులు పాల్గొన్నారు.

తెలుగు జాతికి సంపద చంద్రబాబు

● 15 ఏళ్లపాటు కూటమి ప్రభుత్వానిదే అధికారం ● పుట్టిన రోజు వేడుకల్లో ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు





రాజమహేంద్రవరంలో కేక్ కట్‌చేసి సీఎం చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు, కోరుకొండలో కేకు తినిపిస్తున్న రుడా చైర్మన్ బీవీఆర్ చౌదరి

రాజమహేంద్రవరంసిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): తెలుగుజాతికి ఎనలేని సంపద మన ముఖ్యమంత్రి చంద్రబాబు అని రాజమహేంద్రవరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు అన్నారు. సీఎం చంద్రబాబు 75వ పుట్టినరోజును పురస్కరించుకుని రాజమహేంద్రవరంలో భవానీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలను ఆదిరెడ్డి వాసు నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌వద్ద ప్రయాణికులు, కార్మికుల కోసం, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి వద్ద రోగులు వారి బంధువుల కోసం రూ.8లక్షలతో రెండు ఆర్వో ప్లాంట్‌లను ఆదిరెడ్డి వాసు ప్రారంభించారు. అనంతరం స్థానిక 4వ డివిజన్‌లో టీడీపీ తాడేపల్లిగూడెం పరిశీలకులు నక్కా చిట్టిబాబు, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నక్కా దేవీ వరప్రసాద్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాలను మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, పరిశీలకులు బొళ్ళ ప్రసాద్, శెట్టిబలిజ కార్పొరేషన్ స్టేట్‌ఛైర్మన్ కుడుపూడి సత్తిబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేక్ కట్‌చేసి 300మందికి భోజనాలు పెట్టారు. అనంతరం ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ సంపద సృష్టికర్త, అభివృద్ధి ప్రధాత చంద్రబాబు అని అన్నారు. కూటమి ప్రభుత్వం మరో 15 ఏళ్లపాటు ఢోకా లేకుండా పాలన సాగిస్తుందన్నారు. తామంతా చంద్రబాబు పుట్టినరోజునాడు రాష్ట్రవ్యాప్తంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించి అభిమానం చాటుకుంటుంటే విద్యాశాఖ, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ మాత్రం చంద్రబాబు తనయుడిగా ఈ పుట్టిన రోజు ఒక ప్రత్యేకమైన గిఫ్ట్‌గా మెగా డీఎస్సీని ప్రకటిస్తూ 16,437 పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వడం ఆనందంగా ఉందన్నారు. రాజమహేంద్రవరం నగర పాలక సంస్థ ఎన్నికలు త్వరలో జరగబోతున్నాయని నాల్గోవ సారి టీడీపీ విజయం సాధించడం ఖాయమన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ గత ఐదేళ్లగా బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు రుణాలు లేవని కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నివర్గాలకు రుణాలు మంజూ రు చేస్తున్నారని గుర్తుచేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మజ్జి రాంబాబు, వర్రే శ్రీనివాసరావు, రెడ్డి మణేశ్వరరావు, దొండపాటి సత్యంబాబు, కిలపర్తి శ్రీనివాస్, బుడ్డిగ రాధా, మరుకుర్తి రవియాదవ్, దాస్యం ప్రసాద్, ఆదారి సూర్యనారాయణ, తెలుగు మహిళాపార్లమెంట్ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, కప్పల వెలుగు కుమారి పాల్గొన్నారు.

● పుష్కరాల రేవులో గన్నికృష్ణ ఆధ్వర్యంలో స్థానిక పుష్కరాల రేవులో ఎన్టీఆర్ విగ్రహం వద్ద గన్నికృష్ణ ఆధ్వర్యంలో సీఎం చంద్రబాబు పుట్టినరోజును పురస్కరించుకుని నిరాశ్రయులకు భారీ అన్నదానం చేశారు. ఈసందర్భంగా గన్నికృష్ణ మాట్లాడుతూ పేదల సంక్షేమమే చంద్రబాబు లక్ష్యమన్నారు. కార్యక్రమంలో నగర టీడీపీ అధ్యక్షుడు రెడ్డి మణేశ్వరరావు, మాజీ కార్పొరేటర్లు మాటూరి రంగారావు, యిన్నమూరి రాంబాబు, పాలవలస వీరభద్రం, పార్టీ నాయకులు నిమ్మలపూడి గోవింద్, శెట్టి జగదీష్, ఎస్ఎ కరీం, మళ్ళవెంకట్రాజు పాల్గొన్నారు.

యర్రా ప్రత్యేక పూజలు

క్షేత్రపాలకుడు శ్రీరుక్మిణి సమేత వేణుగోపాల స్వామి ఆలయంలో టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ యర్రా వేణుగోపాలరాయుడు ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రం ప్రగతి సాధించాలన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పదంలో నడిపించే శక్తి తమ నాయకుడు చంద్రబాబుకు ఇవ్వాలని కోరూతూ వేద పండితులతో పూజలు చేయించారు. అనంతరం స్థానిక వీరభద్రపురం కస్తూరిబా ఆశ్రమంలో వృద్ధులకు భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో చాంబర్ అధ్యక్షుడు తవ్వా రాజా, మాజీ కార్పొరేటర్ డాక్టర్ కొమ్మాశ్రీనివాసరావు, నాయకులు చించినాడ తాతాజీ, మాటూరి సిద్దార్ధ, నల్లం ఆనంద్ పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రార్ధనలు

సీఎం చంద్రబాబు నిండునూరేళ్లు జీవించి రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు తీసుకువెళ్లాలని కోరూతూ రాజమహేంద్రవరంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక హెర్మోన్ ప్రేయర్‌హౌస్‌లో సోమవారం ప్రత్యేకప్రార్ధనలు చేశారు. రాజమండ్రి పాస్టర్ సొసైటీ అధ్యక్షుడు సిర్రా ప్రకాశం అధ్యక్షతన ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. అనంతరం కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ గిరిబాబు, తానేటి ప్రభు, రవి యాదవ్, కృపామణి, అజ్జరపు రమేష్, వాసు, అరుణకుమార్, పి.సుధాకర్, ఎం. నాగమణి, టి.చింత, జనసేన నాయకులు చక్రమని రాజు తదితరులు పాల్గొన్నారు.

లూధరన్ చర్చిలో ప్రార్ధనలు

ధవళేశ్వరం: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పుట్టినరోజు వేడుకలను టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఎస్ఎంఈ లూధరిన్ చర్చిలో నిర్వహించిన ప్రార్ధనలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి పాల్గొన్నారు. అనంతరం కేక్ కట్‌చేసి చంద్రబాబుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. గోరంట్ల మాట్లాడుతూ రాష్ట్ర అభివృద్ధికోసం అహర్నిశలు కృషిచేస్తున్న చంద్రబాబుకు సంపూర్ణ ఆరోగ్యాన్ని మరింత శక్తిని ప్రసాదించాలని ప్రా ర్ధనలు చేసినట్లు తెలిపారు. చర్చికి అవసరమైన ఫ్రిజర్ బాక్స్, పార్థివదేహాన్ని తరలించే వాహనాన్ని అందజేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం పలుకు బధిరుల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థుల మధ్య కేక్ కట్‌చేసి చంద్రబాబుకు జన్మదినాన్ని నిర్వహించారు. విద్యార్థులకు భోజనాలు ఏర్పాటు చేసి స్వయంగా వడ్డించారు. ఆయా కార్యక్రమా ల్లో ఎమ్మెల్యే వెంట ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు, రూరల్ మండలపార్టీ అధ్యక్షుడు ఎం సీహెచ్ శివసత్యప్రసాద్, తలారి మూర్తి, మజ్జి పద్మ, టి.రామసుబ్బారావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గోకవరం: మండలంలోని పలు గ్రామాలలో చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను టీడీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాలలో కేక్‌లను కట్‌చేసి సంబరాలు జరుపు కున్నారు. స్థానిక హన్నా విద్యాసంస్థల అధినేత బొడ్డు సువర్ణకుమార్ ప్రభుత్వాసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. చంద్రబాబు పుట్టినరోజును పురష్కరించుకొని ఆసుపత్రికి ఒక ఏసీని బహూకరించ నున్నట్లు సువర్ణకుమార్ ప్రకటించారు.

పండుగలా చంద్రబాబు జన్మదిన వేడుకలు

రాజమహేంద్రవరంరూరల్: రూరల్ మండల పరిధిలోని తొర్రేడు, కాతేరు కోలమూరు, కొంతమూరు, హుకుంపేట, రాజవోలు, పిడింగొయ్యి, తదితర గ్రామాల పరిధిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. చంద్రబాబు ఫ్లెక్సీలకు పాలాభిషేకాలు చేశారు. దేవాలయాలు, చర్చిలు, మసీదులలో ప్రత్యేక ప్రార్ధనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. పేదలకు, వృద్ధులకు చీరలు, మిఠాయిలు పంపిణీ చేశారు. పలుచోట్ల రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ మార్ని వాసుదేవరావు తదితరులు పాల్గొనారు. బొమ్మూరు సెంటరులో మండల టీడీపీ అధ్యక్షుడు మత్యేటి శివసత్యప్రసాద్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే గోరంట్ల భారీ కేక్ కట్ చేశారు. చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. అనంతరం వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కామిని ప్రసాద్‌చౌదరి, భీమర శెట్టి రమేష్, రాయుడు సునీల్, కోటిపల్లి అమ్ములు పాల్గొన్నారు. కొంతమూరులో దండమూడి సత్యప్రసాద్ ఆధ్వర్యంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో నాగరాజు, గోక శ్రీను, తదితరులు పాల్గొన్నారు. మోరంపూడి సెంటర్‌లో సత్యచారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదినం పురస్కరించుకొని చలివేంద్ర ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డ్ చైర్మన్ మార్ని వాసుదేవరావు కేక్ కట్‌చేసి అక్కడ వారికి పంచారు. కార్యక్రమంలో తమ్మా రవి, సత్య చారిటబుల్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

బిక్కవోలు: సీఎం చంద్రబాబు జన్మదిన వేడుకలను ఆదివారం ఊలపల్లిలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా బిక్కవోలు పీహెచ్‌సీ మాజీ చైర్మన్ తొండాపు సురేష్‌కుమార్‌రెడ్డి కేకు కట్‌చేసి కూటమి నేతలకు అందజేశారు. కార్యక్రమంలో కాకర్ల అశోక్, బండారు శివ, అర్జున్, తేజ, గోపి, నాయుడు, సూరిబాబు, బోస్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ: కోరుకొండలో ఆదివారం టీడీపీ ఇన్‌చార్జ్ రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఆధ్వర్యంలో కోరుకొండ నరసింహస్వామికి పూజలు, అర్చనలు నిర్వహించారు. సీఎం చంద్రబాబు నిండునూరేళ్ల ఆయురారోగ్యాలతో ఉండాలని, రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించాలని మొక్కుకున్నారు. అనంతరం కోరుకొండ బస్టాండ్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహంవద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. టీడీపీ గ్రామకమిటీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బొడ్డు వెంకటరమణచౌదరి ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్ కట్ చేశారు. నాయకులకు, కార్యకర్తలకు స్వీట్లు పంచారు. అనంతరం బూరుగుపూడి టీడీపీ కార్యాలయంవద్ద భారీ కేక్ కట్ చేసి బొడ్డు వెంకటరమణ చౌదరి టీడీపీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ ముందుచూపు అన్న పదానికి చంద్రబాబు నాయుడు గొప్ప ఉదాహరణ అన్నారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు తనకాల నాగేశ్వరరావు, కంటే నాగకేశవరావు, గంగిశెట్టి చంటిబాబు,దాశెట్టి శ్రీనివాసు,ఇసుకపల్లి రాజారావు, కొచ్చెర్ల చిన్నారావు, జాజుల సుబ్రహ్మణ్యం, ఎంపీటీసీ పీతా శ్రీనుబాబు, గోనగూడెం సర్పంచ్ రొంగల శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

రంగంపేట: రంగంపేట పంచాయతీ వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పండుగ వాతావరణంలో ఘనంగా నిర్వహించారు. బాణా సంచాకాల్చి, కేక్ కట్‌చేసి సీఎం చంద్రబాబుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. మండలంలో పలు గ్రామాల్లో చంద్రబాబు జన్మదిన వేడుకల జరుపుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడు ఎలుగుబంటి సత్తిబాబు, బీజేపీ మండల అధ్యక్షుడు ఎమ్.సాయిరామ్, జనసేన మండల అధ్యక్షుడు జి.సత్తిబాబు కూటమి నీలపాల త్రిమూర్తులు, ఉండవిల్లి గిరిబాబు, గొరపాటి రాంబాబు, పోతుల చిన్నికాపు, బలిరెడ్డి దుర్గారావు, శ్రీను, రాంబాబు, వరప్రసాద్, ప్రసాద్ నాయకులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

రంగంపేట, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన రంగంపేట సినిమా సెంటర్‌లో పాస్టర్ కుసుమంచి కృష్ణంరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం జడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు ప్రారంభించారు. కార్యక్రమంలో పాలాటి నాగేశ్వరరావు, పాస్టర్లు అరుణ్‌కుమార్,వరప్రసాద్, కోటేశ్వరరావు, చక్రవర్తి, పుష్పరాజు, జాషువ, మోషే, బైబిలు మిషన్ సభ్యులు పాల్గొన్నారు.

విజనరీ కలిగిన నాయకుడు చంద్రబాబు : ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి



అనపర్తి గాంధీబొమ్మ సెంటర్ వద్ద కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేశంలోనే విజనరీ కలిగిన నాయకుడిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడికి గుర్తింపు ఉందని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. ఆదివారం రాష్ట్ర సీఎం నారాచంద్రబాబు నాయుడి 75వ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని అనపర్తిలో అనేక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా గాంధీబొమ్మ సెంటర్‌వద్ద ఏర్పాటుచేసిన కేక్‌ను, పంచా యతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటుచేసిన కేక్‌ను ఎమ్మెల్యే కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పాదయాత్రగా దేవీచౌక్‌కు చేరుకుని అక్కడ బస్టాండ్ వద్ద అభిమానులు ఏర్పాటుచేసిన కేక్ కట్ చేశారు. అనంతరం ఏరియా ఆసుపత్రికి చేరుకుని రోగులకు రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నాలుగుసార్లు ముఖ్యమంత్రి పదవిని చేపట్టిన చంద్రబాబు నిరంతరం ప్రజల అభివృద్ధిని కోరుకుంటూ అనేక పథకాలను ప్రవేశపెట్టారని అన్నారు. కూటమి నాయకులు సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, రామాడ నాగు, కొవ్వూరి వేణుగోపాలరెడ్డి, తేనెల శ్రీనివాస్, చింతా సురేష్‌రెడ్డి, దత్తుడు, సానా శ్రీను. గంగాభవాని, హేమతులసి, సూర్యకుమారి, సుభాషిణి పాల్గొన్నారు.



గోకవరంలో ఆసుపత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేస్తున్న సువర్ణకుమార్



రంగంపేట: సింగంపల్లిలో కేక్ కట్‌చేసి ఘనంగా చంద్రబాబు జన్మదిన వేడుకలు జరుతున్న టీడీపీ నాయకులు

బ్యాంకు ఉద్యోగ ఖాళీలు వెంటనే భర్తీ చేయాలి

● ఏఐబీఈఏ నాయకుల డిమాండ్

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని, ఐదు రోజుల పనిదినాలు అమలు చేయాలని అఖిలభారత బ్యాంకు ఉద్యోగుల సమైక్య (ఏఐబీఈఏ) నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ధర్మంచర కమ్యూనిటీ హాలులో ఏఐబీఈఏ 80వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐబీఈఏ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగుల సంఘం నాయకులఉ కామేశ్వరరావు, కేవీ స్వాతి, ఉమారాణి, రమేష్, మురళీధర్, రాంబాబు, అప్పారావు, వెంకటేశ్వరరావు, సూర్య, కిషోర్, రవిచంద్ర తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ల నియామకంపై హర్షం

ధవళేశ్వరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా సీనియర్ టీడీపీ నాయకుడు మార్ని వాసుదేవరావు నియమితులవ్వడం, ఆయన సారధ్యంలో బోర్డు డైరెక్టర్లుగా స్థానిక నాయకులు టీడీపీకి చెందిన బండి జ్యోతి, జనసేన నుంచి కొప్పిశెట్టి గాంధీ, బీజేపీ నాయకురాలు పన్నాల లక్ష్మీ సంతోషిలను నియమించడంపై జనసేన నాయకుడు యడ్ల మహేష్‌బాబు ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. వీరి నియామకానికి కృషి చేసిన మంత్రి కందుల దుర్గేష్, రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, ఏఎంసీ ఛైర్మన్ మార్ని వాసుదేవరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు శీలా వీర్రాజు స్మారక పురస్కార ప్రదానం

రాజమహేంద్రవరంకల్చరల్, ఏప్రిల్ 20: ప్రముఖ రచయిత, చిత్రకారుడు శీలా వీర్రాజు స్మారక పురస్కారాలను,మంగళవారం ఉదయం 11గంటలకు స్థానిక దామెర్ల రామారావు ఆర్ట్ గేలరీలో ప్రదానం చేయనున్నట్లు మాదేటి రాజాజీ ఆర్ట్ అకాడమీ వ్యవస్థాపక కార్యదర్శి మాదేటి రవి ప్రకాష్ తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్ సన్నిదానం శాస్త్రి అధ్యక్షతన ప్రముఖ చిత్రకారులు తారా నగేష్, పట్నాల రాధారాణిలకు, మాజీ పార్లమెంటు సభ్యులు ఉండవల్లి అరుణ్‌కు బార్ పురస్కార ప్రదానం చేస్తారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం కల్చరల్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): గజ్జాలమ్మ అమ్మవారి 65వ జాతర మహోత్సవంలో భాగంగా ఆదివారం ఆలయ కమిటీ, పీఎంపీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో డెల్టా హాస్పిటల్ వారి సౌజన్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ ఆకుల శ్రీలక్ష్మి శృతి ఉచితంగా ఈసీజీ పరీక్షలు, రక్త పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశా రు. కార్యక్రమంలో పీఎంపీ జిల్లా అధ్యక్షుడు బళ్ళా శ్రీనివాసరావు, కార్యదర్శి పి.దేవానందం రహమాన్ ఖాన్,మట్టా రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సత్తెమ్మ తల్లి ఆలయం వద్ద చీరలు పంపిణీ

కోరుకొండ, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కోరుకొండ మండలం శ్రీరంగపట్నం సత్తెమ్మ తల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు సందర్భంగా ఆదివారం 500 మంది మహిళలకు రామసేన అధ్యక్షుడు కంబాల శ్రీనివాసరావుచీరలు పంపిణీ చేశారు. అంతకుముందు జరిగిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.

జ్ఞానసరస్వతి ఆలయాన్ని సందర్శించిన ఎంపీ పురందేశ్వరి



గౌతమిఘాట్ వద్ద జ్ఞాన సరస్వతి ఆలయాన్ని సందర్శించిన ఎంపీ పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సరస్వతిఘాట్‌లోని శ్రీ జ్ఞానసరస్వతి ఆలయాన్ని బీజేపీ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురంధేశ్వరి ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ తోట సుబ్బారావు ఎంపీ పురంధేశ్వరికి పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. చిరు సత్కారం చేశారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను ఎంపీ పరిశీలించారు.

ఎంపీని కలిసిన నన్నయ వీసీ

ఆదికవి నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్న ఆదివారం సాయంత్రం రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిరువురు విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఎంపీ పేర్కొన్నారు.

బీజేపీలో చేరికలు

కాకినాడ జిల్లాకు చెందిన పలువురు ఆదివారం సాయంత్రం ఎంపీ పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు. రాజమహేంద్రవరంలోని జిల్లా బీజేపీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు విశ్వేశ్వరరావు ఆధ్వర్యంలో పలువురు బీజేపీలో చేరారు. వారికి ఎంపీ పురందేశ్వరి పార్టీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు అన్యాయం చేసిన కాంగ్రెస్

డాక్టర్ అంబేడ్కర్‌ను కాంగ్రెస్ పార్టీ తమ రాజకీయ స్వలాభం కోసం వాడుకుని వదిలేసిందని, ఆయన ఆశయాలను నూటికి నూరుశాతం బీజేపీ ఆచరిస్తూ దేశాభివృద్ధి దిశగా అడుగులు ముందుకు వేస్తున్నదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. ఆదివారం బీజేపీ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరంలోని చాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న పురందేశ్వరి మాట్లాడుతూ అంబేడ్కర్‌ను తమ నాయకుడిగా ప్రచారం చేసుకుంటున్న కాంగ్రెస్ పార్టీ ఆయనకు రాజకీయంగా తీరని అన్యాయం చేసిందని, తీవ్రంగా అవమాన పరిచిందని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ అంబేడ్కర్‌ను రాజకీయంగా ఓడించే ప్రయత్నం చేసిందన్నారు. సమ సమాజస్థాపన, సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలని సంకల్పించిన డాక్టర్ అంబేద్కర్ ఆదర్శాలను, ఆశయాలను బీజేపీ ఆచరించి పాటిస్తున్నదని పురందేశ్వరి పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, పలువురు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీజీఈఏ జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ వర్మ

రాజమహేంద్రవరంఅర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, న్యాయమూర్తి అధ్యక్షతన పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ అన్నారు. ఆదివారం అసోసియేషన్ సమావేశం రాజమహేంద్రవరంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం జూన్ నెలలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్నామని అన్నారు. ఈనెల 12 సంఘం రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ఉద్యోగ సమస్య పరిష్కార వేదిక ఏర్పాటు చేయాలని, తాత్కాలిక భృతి ప్రకటించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహఅధ్యక్షుడు చాంబర్లీన్, ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, పి.రవికుమార్, జిల్లా కార్యదర్శులు రమేష్, శ్రీనివాస్, దినేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

‘ఉపాధ్యాయులపై యాప్‌ల భారం లేకుండా చేయాలి’



సమావేశంలో మాట్లాడుతున్న పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజారావు

దివాన్‌చెరువు, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయులపై యాప్‌ల భారం లేకుండా చేయాలని ప్రోగ్రెసివ్ రికగ్నైజ్డ్ టీచర్స్ యూనియన్ (పీఆర్‌టీయూ) జిల్లా అధ్యక్షుడు పి.రాజారావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. లాలాచెరువులో ఆదివారం జరిగిన పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన అధ్యక్షత వహించి మాట్లాడుతూ జీవో నెం.117 రద్దును స్వాగతించారు. యూపీ పాఠశాలలో రేట్‌తో సంబంధంలేకుండా 6,7,8 తరగతులకు స్కూల్ అసిస్టెంట్‌లను కేటాయించాలని కోరారు. అలాగే హైస్కూల్ ప్లస్ కొనసాగిస్తూ అర్హులైన స్కూల్ అసిస్టెంట్‌లకు జెఎల్ గా పదోన్నతి ఇవ్వాలని అన్నారు. పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.అగ్నేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయ బదిలీలకు చట్టం తేవడంపై ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. బదిలీలను ఆన్‌లైన్‌లో కాకుండా ప్రత్యక్ష పద్ధతిలో జరపాలన్నారు. సమావేశంలో జిల్లావర్కింగ్ అధ్యక్షుడు ఐ.వి.రమణ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సాంబశివరావు, దుర్గాప్రసాద్, మహిళా కార్యదర్శి రహీమా బేగం, జిల్లా గౌరవాధ్యక్షుడు జి.వి.గుప్తా వివిధ మండలాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఘనంగా పునరుత్థాన దినం



క్రైస్తవులకు అల్పాహారం అందజేస్తున్న రఘురామ్‌కిరణ్

ధవళేశ్వరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో ఈస్టర్ పండుగను సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఏసుక్రీస్తు సమాధి నుంచి తిరిగి లేచిన సందర్భంగా పెద్దల సమాధులను అలకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్ధనలు నిర్వహించారు. తెల్లవారుజామునే సమాధుల వద్దకు వచ్చిన క్రైస్తవులకు టీడీపీ నాయకులు కొడమంచలి సూర్య ఆధ్వర్యంలో అల్పాహారం, పాలు అందించారు. టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్ విచ్చేసి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పండూరి అప్పారావు, నీలికోటేశ్వరరావు, పిన్నంటి ఏకబాబు, బర్రి సుబ్బారావు, పల్లా రామసామి, ఆళ్ళ విఠల్, తాతపూడి ఆనంద్, జనసేన నాయకుడు యడ్ల మహేష్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: గుడ్ బ్యాడ్ అగ్లీ
సూర్యమినీ	: జాట్, జాక్
సూర్యప్యాలస్	: సిన్నర్స్
స్వామి	: ఓదెల-2
శివజ్యోతి	: అర్జున్ s/o వైజయంతి
అనుశ్రీ(సాయికృష్ణ)	: అర్జున్ s/o వైజయంతి
రాజా	: ఓదెల-2
ఊర్వశి	: మ్యాడ్ స్క్వేర్
రంభ	: అక్కడ అమ్మాయి...
మేనక	: మధురం, డియర్ ఉమ
అప్సర	: అర్జున్ s/o వైజయంతి
కుమారి	: ఓదెల-2
అశోక	: అర్జున్ s/o వైజయంతి
వీఎస్ మహల్(నామవరం)	: అర్జున్ s/o వైజయంతి
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: అర్జున్ s/o వైజయంతి
వెంకటసూర్య(కడియం)	: అర్జున్ s/o వైజయంతి
సత్యగౌరి (అనపర్తి)	: ఓదెల -2
సూర్యశ్రీ (అనపర్తి)	: అర్జున్ s/o వైజయంతి
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: అర్జున్ s/o వైజయంతి
గీతాసినిమాస్(సీతానగరం)	: అర్జున్ s/o వైజయంతి
శ్రీనివాస (గోకవరం)	: అర్జున్ s/o వైజయంతి
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: ఓదెల-2
లలితామహల్(రంపచోడవరం)	: అర్జున్ s/o వైజయంతి
నవయుగ(చింతూరు)	: అర్జున్ s/o వైజయంతి



రాజమహేంద్రవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 40.5 (ఆదివారం)
కనిష్ఠం : 25.5



నల్లజర్లలో కేక్ కటింగ్

మీ రాకడ కోసం..

ఈస్టర్ వేడుకలు జిల్లా వ్యాప్తంగా ఆదివారం ఘనంగా జరిగాయి.. వేకువజాము నుంచే కుటుంబీకుల సమాధులను పువ్వులతో అలంకరించి.. కొవ్వొత్తులు వెలిగించారు. ఆయా సమాధుల వద్దకు అంతా చేరుకుని ప్రార్థనలు చేశారు. తమవారిని తలచుకుని.. మీ రాకడకు ఎదురుచూ స్తున్నామంటూ కన్నీటి పర్యంతమయ్యారు.. - కొవ్వూరు



కొవ్వూరులో జనంతో నిండిన క్రిస్టియన్ శ్మశాన వాటిక.. సమాధుల వద్ద ప్రత్యేక ప్రార్థన చేస్తున్న మునిసిపల్ చైర్మన్ రత్నకుమారి కుటుంబీకులు

హ్యాపీ బర్త్‌డే బాబు

ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు ఆదివారం ఊరూవాడా ఘనంగా జరిగాయి.. నాయకులు ఎవరికి తోచిన రీతిన వారు సేవా కార్యక్రమాలు చేశారు. జిల్లా వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లోనూ పండుగలా చేశారు. కడియంలో 500 కేజీల ధాన్యంతో హ్యాపీ బర్త్‌డే సీఎం సార్ అంటూ తయారుచేసిన చిత్రం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. - కడియం



పేదింటికి.. గడువు!



(కాకినాడ,ఆంధ్రజ్యోతి)

ఇళ్లకు మరో పది రోజులే దరఖాస్తుల స్వీకరణ

- సొంతింటికి దరఖాస్తుల వెల్లువ
- ఉమ్మడి జిల్లాలో 44,354
- కాకినాడలో అత్యధికం 18,500
- కోనసీమ జిల్లా 13,754
- తూర్పుగోదావరి 12,200
- 95 శాతం మందికి సొంత స్థలమే
- ఇప్పటికే వడపోత వేగవంతం
- తహశీల్దార్ల పొజిషన్ సర్టిఫికెట్లు
- కేంద్రం నుంచి అనుమతులు
- ఇంటికి రూ.2.50 లక్షల సాయం

సొంతింటి కల నెరవేర్చుకునేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా పేదలు భారీగా ప్రభుత్వానికి దరఖాస్తులు చేశారు. వేలాది మంది సచివాలయాల ద్వారా వినతులు అందించారు. తమకు సొంత స్థలం ఉందని, ఇంటి నిర్మాణానికి సాయం చేయాలంటూ విన్న వించారు. ఇలా ఇప్పటి వరకు ఉమ్మడి జిల్లాలో 44,354 మంది దరఖాస్తు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా కాకినాడ జిల్లాలో 18,500 మంది ఉన్నారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 13,754, తూర్పుగోదావరిలో 12,200 దరఖాస్తులు వెల్లువెత్తాయి. మరో పది రోజుల్లో దరఖాస్తుల దాఖలుకు గడువు ముగియనున్న నేపథ్యంలో ఇంకో నాలుగు వేల మంది వరకు వినతులు పెరిగే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. మరో పక్క ఉమ్మడి జిల్లాలో నగరాభివృద్ధి సంస్థల పరిధిలోని కార్పొరేషన్లు, మునిసిపాలిటీల్లో నివాసం ఉంటూ సొంతింటి కోసం దరఖాస్తు చేసుకున్న వారికి దాదాపు ఇళ్లు మంజూరైనట్లేనని అధికారులు చెబుతున్నారు. నగరాలు, పట్టణాల పరిధిలో ఇళ్లకు కేంద్రం నేరుగా ఇళ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తున్నందున లబ్ధిదారులకు వేగంగా నిధులు రానున్నాయి.

95 శాతం స్థలం ఉన్నవారే..

దరఖాస్తుదాల్లో 95 శాతం మంది తమకు సొంతంగా ఇంటి స్థలాలు ఉన్నట్టు ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో వీరికి సొంత స్థలం ఉన్నట్టు ఆయా మండలాల తహశీల్దార్లతో పరిశీలించి పొజిషన్ సర్టిఫికెట్లను అధికారులు తీసుకుంటున్నారు. ఇప్పటికే సగానికిపైగా దరఖాస్తులకు సంబంధించి ప్రక్రియ ముగిసింది. మరో పక్క వచ్చిన దరఖాస్తుల్లో నిబంధనల ప్రకారం ఉన్న వాటిని లబ్ధిదారుల యాప్‌లో అధికారులు నమోదు చేస్తున్నారు. గతంలో వీరు ఎప్పుడైనా, ఎక్కడైనా ప్రభుత్వం నుంచి స్థలం లేదా ఇళ్లు పొంది ఉన్నారా? లేదా? అనేది గుర్తించే ప్రక్రియ త్వరలో మొదలు పెట్టనున్నారు. అర్హుల జాబితాకు సంబంధించి వడపోత పూర్తయితే వాటిని కేంద్ర ప్రభుత్వ హౌసింగ్ వెబ్‌సైట్‌లోను పట్టణం, గ్రామీణ ప్రాంతం విభాగంలో అప్‌లోడ్ చేయనున్నారు. దరఖాస్తు చేసుకున్న ఒక్కో లబ్ధిదారుడు పథకానికి అర్హత సాధిస్తే ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 లక్షలు మంజూరు చేయనుంది.ఇందులో కేంద్రం వాటా రూ.1.50 లక్షలు. దరఖాస్తుదారులకు సొంత స్థలం ఉంటే సాధ్యమైనంత వేగంగా పథకం పురోగతి ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. దరఖాస్తుదారులు భారీగా క్యూకట్టడంతో వేగంగా ఇళ్ల నిర్మాణాలు సాగేలా కనిపిస్తున్నాయి.

నెలాఖరు వరకూ అవకాశం..

పేదల సొంతింటి కలను నెరవేర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం చకచకా అడుగులు వేస్తోంది. సచివాలయాల ద్వారా గతేడాది నవంబరు ఆఖరు నుంచి దరఖాస్తులు స్వీకరిస్తోంది. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సొంత స్థలం ఉన్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేసి నిధులు మంజూరు చేస్తామని తెలిపింది.ఈ నేపథ్యంలో ఇప్పటి వరకు ఉమ్మడిజిల్లా వ్యాప్తంగా 43,737 మంది దరఖాస్తులు చేసుకున్నట్టు అధికారులు తేల్చారు.అత్యధికంగా తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలంలో 3 వేలు, గోపాలపురం 1600,రాజానగరం మండలంలో 1,200 మంది వరకు పేదలు దరఖాస్తు చేసుకున్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో అత్యధికంగా కాట్రేనికోన మండలంలో 1,024,ఉప్పలగుప్తం 1,006, ఐ.పోలవరం 904, అయినవిల్లి 859, అంబాజీపేట 850, అమలాపురం 846, అత్యల్పంగా మండపేటలో 67 దరఖాస్తులు వచ్చాయి.కాకినాడ అర్బన్ పరిధిలో అత్యధిక దరఖాస్తులు వచ్చాయి.ఈ నెలాఖరుతో దరఖాస్తుల గడువు ముగియనుంది.

పట్టణ ఇళ్లకు ఢోకా లేదు..

ఉమ్మడి జిల్లాలో కుడా, రుడా, అముడా పరిధిలోకి వచ్చే దరఖాస్తులకు సంబంధించి అర్హులకు దాదాపు ఇళ్లు మంజూరైనట్లేనని అధికారులు చెబుతున్నారు. వీటి పరిధిలో ఇళ్లకు పూర్తిగా కేంద్రమే నిధులు ఇవ్వనుంది. దీంతో నిధుల సమస్య వచ్చే అవకాశం లేదు. అటు గ్రామీణప్రాంతాల్లో ఇళ్లకు సంబంధించి రాష్ట్ర వాటా నిధులు ఎక్కువగా అవసరం ఉంది. ఈ నేపథ్యంలో వీటి మంజూరుకు సైతం అధికారులు నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

నాడంతా అస్తవ్యస్తం

వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గత వైసీపీ ప్రభుత్వం జగనన్న ఇళ్ల స్థలాల పేరుతో పేదలను నిలువునా ముంచేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 3.06 లక్షల మందిని పేదల ఇళ్లస్థలాలకు అర్హులుగా గుర్తించింది. వీరందరికీ 7,610 ఎకరాలు అవసరమవుతాయని నిర్ధారించారు.రెండు వేల ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగిలిన 5,610 ఎకరాల ప్రైవేటు భూములను రూ.2,200 కోట్లకుపైగా వెచ్చించి కొనుగోలు చేసింది. అయితే పేదల ఇళ్లస్థలాలకు అనువైన ప్రాంతాలు కాకుండా కేవలం స్థానిక అధికార పార్టీ నాయకులకు ఆర్థికంగా కలిసి వచ్చే.. ఎందుకూ పనికి రాని భూములను అధిక ధరలకు కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో 1,540 వరకు లేఅవుట్లు వేశారు.ఇందులో వెయ్యికిపైగా లేఅవుట్ల వరకు వర్షాలకు తరచూ నిండా మునిగిపోయేవి.150 ఎకరాల కరప సెంట్రల్ లేఅవుట్ దగ్గర నుంచి,జగన్ ప్రారంభించిన కొమరగిరి లేఅవుట్,రాజమహేంద్రవరానికి సమీపంలోని ఆవ భూములు,మండపేట, రామచంద్రపురం, కడియం, పిఠాపురం, సామర్లకోట, గొల్లప్రోలు, కాకినాడ, పెద్దాపురం, జగ్గంపేట, గోకవరం,పెదపూడి ఇలా అనేక మండలాల్లో మునిగిపోయిన పరిస్థితి.వీటిలోనే లబ్ధిదారులు తమకు ఇచ్చిన పట్టాల్లో ఇళ్లు కట్టుకోవాలని ప్రభుత్వం ఒత్తిడి తెచ్చింది.గత వైసీపీ ప్రభుత్వంలో ఇళ్ల పథకం అస్తవ్యస్తంగా మారిన నేపథ్యంలో ఇప్పుడు ఆ తప్పులు లేకుండా అధికారులు పథకాన్ని పక్కాగా అమలు చేయనున్నారు.లబ్ధిదారు లంతా ఇళ్లు కట్టుకునేలా పర్యవేక్షించనున్నారు.

థాంక్యూ సీఎం సార్!



చంద్రబాబు వచ్చారు..డీఎస్సీ ఇచ్చారు

- మెగా డీఎస్సీ నోటిఫికేషన్
- ఉమ్మడి జిల్లాలో 1035 పోస్టులు
- జూన్ 6 నుంచి పరీక్షలు
- అభ్యర్థుల ఆనందం

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : మెగా డీఎస్సీ-2025 ఉపాధ్యాయ నియామకాలకు నోటిఫికేషన్ ఆదివారం విడుదలైంది. జిల్లాస్థాయి నియామకాలకు ప్రకటించిన మొత్తం 1035 స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ కేడర్ టీచరు పోస్టులకు అదనంగా మరికొన్ని ఇతర శాఖల ఆధీనంలోని పాఠశాలలకు కూడా మంజూరుచేసిన పోస్టులను చేర్చి మెగా డీఎస్సీ నోటిఫికేషన్ జారీచేశారు. జిల్లాలోని బుట్టాయిగూడెం, జీలుగుమిల్లి, పోలవరం, కుకునూరు, వేలేరుపాడు మండలాల్లోని ట్రైబల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలల్లో నియామకాలకు మరో 32 పోస్టులు, జువెనైల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో ఏలూరులో నిర్వహిస్తోన్న ప్రభుత్వ బాలుర వసతిగృహం పాఠశాలకు 7 పోస్టులు మెగా డీఎస్సీ నోటిఫికేషన్‌లోనే చేర్చారు. ఇవి గాక ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు (జోన్-2) పరిధిలోని వివిధ సంక్షేమశాఖలు నిర్వహించే రెసిడెన్షియల్/నాన్‌రెసిడెన్షియల్ పాఠశాలల్లో టీచరు నియామకాలకు ఉద్దేశించిన 348 పీజీటీ,టీజీటీ, పీడీ, పీఈటీ జోనల్ పోస్టులను తాజాగా ప్రకటించిన డీఎస్సీలోనే చేర్చడం విశేషం.ఈ జోనల్ పోస్టుల్లో ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు కేటాయించిన టీచరు పోస్టుల సంఖ్యపై సంబంధిత శాఖల రాష్ట్ర ఉన్నతాధికారులు ప్రకటించాల్సి ఉంది. వీటిని మినహాయిస్తే మెగా డీఎస్సీ-2025లో ఉమ్మడి జిల్లాలో తొలుత ప్రకటించిన 1035 పోస్టుల కంటే అదనంగా మరో 39 (32+7) ఉపాధ్యాయ నియామకాలను చేపడుతున్నట్టు స్పష్టమైంది. ఆ ప్రకారం జిల్లాస్థాయి నియామకాలు 1074 పోస్టులకు, జోన్-2 పరిధి జిల్లాల్లో మరో 348 పోస్టులకు జోనల్‌స్థాయి నియామకాలు మెగా డీఎస్సీ-2025లో జరుగు తాయని చెప్పవచ్చు.

సామాజికవర్గాలవారీగా రోస్టర్లు

వివిధ సామాజికవర్గాలకు రోస్టర్‌ప్రకారం కేటాయించిన వెకెన్సీలు,లోకల్/నాన్‌లోకల్ రిజర్వేషన్లు, జిల్లా/జోన్‌వారీగా పోస్టుల కేటాయింపులు తదితర సమగ్రవివరాలను నోటిఫికేషన్‌లో పేర్కొనడంతో అభ్యర్థులు తమస్థానం గురించి బేరీజువేసుకుని పరిశీలించుకుంటున్నారు. తుదిగా ఉపాధ్యాయ ఉద్యోగాలకు ఎంపికయ్యేవారంతా అప్రెంటీస్ షిప్‌తో సంబంధంలేకుండా నేరుగా రెగ్యులర్ స్కేలులో నియమితులవుతుండడంతో అభ్యర్థుల్లో రెట్టింపు హర్షం వ్యక్తమవుతోంది. దరఖాస్తుచేసుకున్న అభ్యర్థులకు జూన్ 6నుంచి జులై 6వరకు సీబీటీ విధానంలో ఆన్‌లైన్ పరీక్షలుంటాయి. డీఎస్సీ నోటిఫికేషన్ విడుదలవడంతో థాంక్యూ సీఎం సార్ అంటున్నారు.

నిరుద్యోగులకు ఊపిరిచ్చింది..



నేను 2005లో బీకాం బీఈడీ చేశా. ఇపుడు నా వయస్సు 41 ఏళ్లు. గతంలో రెండుసార్లు ప్రయత్నించా. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం డీఎస్సీ మెగా నోటిఫి కేషన్ ఇవ్వడం బీఈడీ నిరుద్యోగులకు ఊపిరినిచ్చింది.
- ఇల్లూరి కామేశ్వరరావు, తాపేశ్వరం

మాట నిలబెట్టుకున్నారు..



2018లో చంద్రబాబు ప్రభుత్వంలో డీఎస్సీ తర్వాత ఇప్పటి వరకు నోటిఫికేషన్ ఇవ్వలేదు. జగన్ ప్రభుత్వంలో నోటిఫికేషన్ ఇచ్చినా ఉపయోగం లేకుండా పోయింది. చంద్రబాబు మాట నిలబెట్టుకున్నందుకు చాలా సంతోషిస్తున్నాం.
- బూర్తి లోవకుమారి, వీకే రాయపురం



ఆదివారం మధ్యాహ్నం నిర్మానుష్యంగా రాజమహేంద్రవరం దేవిచౌక్ సెంటర్

ఉక్కిరిబిక్కిరి!

- మండిపడిన భానుడు
- ఉక్కబోతతో సతమతం

రాజమహేంద్రవరం సిటీ,ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): భానుడు రోజు రోజుకు తన ప్రతాపం చూపుతున్నాడు.. ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాడు. గత నాలుగు రోజులుగా ఉష్ణోగ్రతలు మండిపోతున్నాయి. అత్యధికంగా 39.0 - 40 డిగ్రీల మధ్య ఎండలు కాస్తున్నాయి. ఆదివారం ఉష్ణోగ్రత గరిష్ఠంగా 40.5 కనిష్ఠంగా 25.5 డిగ్రీలు నమోదైంది. గాలిలో తేమ లేకపోవడంతో ఉక్కబోతతో ప్రజలు అల్లాడిపోయారు. ఉదయం 10 గంటల నుంచే సూరీడు మండిపడ్డాడు. జనం బయటకు రావాలంటేనే భయపడిపోయారు.మధ్యాహ్నం 12 గంటల సమయానికి రహదారులన్నీ నిర్మానుష్యంగా మారిపోయాయి.ఆదివారం సెలవు రోజైన ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. ఎండ వేడిమికి ఏసీల వినియోగం పెరిగింది.ఏసీ అవుట్‌డోర్ యూనిట్స్ నుంచి వచ్చిన వేడిగాలులతో ఉష్ణో గ్రతలు పెరిగాయి.ఇప్పుడే ఇలా ఉంటే మే నెలలో ఎలావుంటుందో అని ప్రజలు ఆందోళనలో పడ్డారు.గోదావరి బండ్ రోడ్డు సాయంత్రం ఊరటగా కనిపించింది.

నేడు డీఆర్‌సీ సమావేశం

రాజమహేంద్రవరం సిటీ, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి) : తూర్పుగోదావరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు.కలెక్టర్ పి.ప్రశాంతి అధ్యక్షతన జరిగే సమావేశానికి జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త పెందుర్తి వెంకటేష్ హాజరు కానున్నారు. ఈ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి నిమ్మల రామానాయుడు ప్రధానంగా 8 అంశాలపై ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారుతో సమీక్షిరు. ప్రధానంగా సమ్మర్ వాటర్ సప్లయి,విజన్ ప్లాన్స్, ప్రొక్యూర్‌మెంట్, ఇసుక యాక్షన్ ప్లాన్, ప్రైమరీ సెక్టార్‌లో అగ్రికల్చర్, హార్టికల్చర్, పశుసంవర్ధక , మత్స్య శాఖలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుతీరు, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్, పాఠశాల విద్యా తదితర అంశాలపై ఇన్‌చార్జి సమీక్ష నిర్వహించనున్నారు.

నేడు పీజీఆర్ఎస్

జిల్లాలో ప్రతి సోమవారం జరిగే పీజీఆర్ఎస్ యథావిధిగా జరుగుతుందని కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంతో పాటు డివిజనల్, మండల కేంద్రాలు, పురపాలక కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు పీజీఆర్ఎస్ నిర్వహిస్తామన్నారు.

వర్రీయే!



సగమే సర్కారు కొనుగోలు.. మిగిలిన సగం మాటేమిటి..

- 58,586 హెక్టార్లలో సాగు
- దిగుబడి 5 లక్షల టన్నులు
- కొనుగోళ్లు 2.5 లక్షల టన్నులు
- మిగిలిన రైతుల లబోదిబో
- మా ధాన్యం కొనాలని డిమాండ్
- రాజానగరంలో రైతుల గగ్గోలు
- దళారులను ఆశ్రయిస్తున్న వైనం
- జిల్లాలో 28 శాతం కోతలు

(రాజమహేంద్రవరం -ఆంధ్రజ్యోతి)

పంట పండింది.. దిగుబడి బాగుంది.. ఆ పంటను ఏం చేయాలనే దానిపై అయోమయం నెలకొంది. కొంత మంది దళారులను ఆశ్రయిస్తుంటే.. మరికొంత మంది ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తున్నారు. పండించిన మొత్తం ధాన్యం పౌర సరఫరాల శాఖ కొనుగోలు చేయకపోవడంతో చాలా మంది రైతులు బ్రోకర్లు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల ద్వారా మంచి ధర లభిస్తున్నా మొత్తం ధాన్యం కొనుగోలు చేసే పరిస్థితి అక్కడా లేదు.జిల్లాలో 58,586 హెక్టార్లలో రబీలో వరి సాగు చేశారు. ప్రస్తుతం కోతలు ఆరంభమయ్యాయి. జిల్లాలో మొత్తం 5 లక్షల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవు తుందని వ్యవసాయశాఖ అంచనా.అయితే 2.5 లక్షల టన్నుల ధాన్యం మాత్రమే కొనుగోళ్ల లక్ష్యంగా నిర్ణయించారు. జిల్లాలో సుమారు 200లకు పైగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ మద్దతు ధర ప్రకారం క్వింటా కామన్ రకం ధాన్యం ధర రూ.2300, అదే గ్రేడ్-ఎ రకం ధర రూ.2,340గా ఉంది.75 కేజీల బస్తా రూ.1720 వరకూ కొనుగోలు చేస్తున్నారు. అయితే ప్రభుత్వం సాగు చేసిన పంటనంతా కొనుగోలు చేసే పరిస్థితి లేక పోవ డంపై ఆందోళన చెందుతున్నారు. పండించిన పంటనంతా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. రాజానగరం మండల పరిధిలోని రెండు గ్రామాల్లో ఇప్పటి వరకూ ధాన్యం కొనుగోలు చేయలేదు..అయితే టార్గెట్ పూర్తయిపోయిందని అధికారులు చెప్పడంతో తమ ధాన్యం ఎక్కడ అమ్ముకోవా లని రైతులు ఆందోళన చెందుతున్నారు. గతంలో ఈ రైతులంతా దళారులు, రైస్ మిల్లర్ల కు అమ్ముకునేవారు. వారు ఎంత ఇస్తే అంత అనే విధంగా ఉండేది. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధిక ధర ఇవ్వ డంతో పాటు 48 గంటల్లోపే రైతు ఖాతాల్లో డబ్బులు జమ వుతుండడం వల్ల మిగతా ధాన్యం కొనుగోలు చేయాలని కోరడం గమనార్హం. ఈ ఏడాది ఇప్పటి వరకూ 5,732 ఎఫ్‌టీవోలకు రూ.116 కోట్లు జమ చేశారు.



కోతలు జోరు..

జిల్లాలో కోతలు జోరందుకున్నాయి. అధికారుల లెక్కల ప్రకారం ఇప్పటికి 28శాతం పూర్తయ్యాయి.నెలాఖరుకి మరో 40శాతం పూర్తవుతాయని..మే మొదటి వారంలో మొత్తం కోతలు పూర్తవుతాయని జిల్లా వ్యవసాయాధికారి ఎస్. మాధవరావు తెలిపారు.18 మండలాల్లో మొత్తం 60042 హెక్టార్లలో ఆయకట్టు ఉండగా 58,586 హెక్టార్లలో వరిసాగు చేశారు. అనపర్తి, ఉండ్రాజవరంలో తక్కువగా కోతలు జరిగాయి. రాజమండ్రి రూరల్‌లో 77.6 శాతం, కడియంలో 7.4 శాతం,రాజానగరంలో 38.4 శాతం, అనపర్తి 1.0 శాతం,బిక్కవోలు 9.2 శాతం, కోరుకొండ 38.9 శాతం,గోకవరం 36.1 శాతం, సీతానగరంలో 54 శాతం,రంగంపేట 48.3 శాతం, చాగల్లులో 37.8శాతం,దేవరపల్లి 34 శాతం, గోపాలపురం 11.8 శాతం, కొవ్వూరు 56.4 శాతం, నిడదవోలు 43.8 శాతం,పెరవలి 13.7 శాతం, తాళ్లపూడి 15.3 శాతం,ఉండ్రాజవరం 2.1శాతం, నల్లజర్ల 28.8 శాతం కోతలు జరిగాయి.

ఆ రెండు గ్రామాల ధాన్యం కొనేదెవరు?

దివాన్‌చెరువు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం శ్రమించి పండించిన ధాన్యం ఇంకా మా కళ్లాల్లోనే ఉంది.. ధాన్యం కొనుగోళ్ల లక్ష్యం ఎలా పూర్తయ్యిందో అర్థం కావడంలేదని రాజానగరం మండలంలోని పాత తుంగపాడు, కొత్తతుంగపాడు గ్రామాలకు చెందిన పలువురు రైతులు శుక్రవారం ఆందోళన వ్యక్తం చేశారు. కొత్తతుంగపాడులో రైతు సేవా కేంద్రం వద్ద వెళ్లి ధాన్యం కొనుగోలు చేయమని కోరగా లక్ష్యం పూర్తయ్యిందని చెబుతుండడంతో దిక్కుతోచని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. మండలంలోని పాతతుంగపాడు, కొత్తతుంగపాడు రెండు గ్రామాలను కలిపి కొత్తతుంగపాడు క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. ఈ రెండు గ్రామాల్లో 1100 ఎకరాల్లో వరి పంట సాగు చేయగా 3600 మెట్రిక్ టన్నులు ధాన్యం దిగుబడి వచ్చింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం సేకరణ కేంద్రానికి వెళ్లగా అధికారులు ధాన్యం కొనుగోళ్లు పూర్తయిపోయాయంటూ చల్లగా చెప్పిన కబురుతో తీవ్ర నిరాశ చెందారు. దీంతో రాజమహేంద్రవరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వెళ్లి తమగోడు చెప్పుకున్నామని రైతు లు ఉంగరాల ఆదినారాయణ, నాగేశ్వరరావు తదితరులు తెలిపారు.మా ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

నిరంతర శ్రామికుడు.. చంద్రబాబు

● వాడవాడలా ఘనంగా సీఎం జన్మదిన వేడుకలు

● పలుచోట్ల అన్నదానాలు, రక్తదాన శిబిరాలు ఏర్పాటు



టీడీపీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ, కంఠమణి

కొవ్వూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధికి పాటుపడుతున్న నిరంతర శ్రామికుడు సీఎం చంద్రబాబు నాయుడని ద్విసభ్య కమిటీ సభ్యులు జొన్నలగడ్డ సుబ్బరాయ చౌదరి, కంఠమణి రామకృష్ణారావు కొనియాడారు. ఆయన 75వ జన్మదినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలోని నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో ద్విసభ్య కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కేక్‌ను కట్ చేశారు. అనంతరం బస్టాండ్ సెంటర్‌కు చేరుకుని, అన్న క్యాంటీన్ వద్ద చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తర్వాత పేద ప్రజలకు అన్నదానం చేశారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు దాయన రామకృష్ణ, ఎంపీపీ కాకర్ల నారాయుడు, ఏఎంసీ చైర్మన్ నాదెళ్ల శ్రీరామ్, అర్బన్‌బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, సూర్యదేవర రంజిత్, అనుపిండి చక్రదరరావు, వట్టికూటి వెంకటేశ్వరరావు, అర్జిల్లి రామకృష్ణ, పెనుమాక జయరాజు, రాజాన శ్రీనివాస్, కాగిత రఘు, బర్ల శ్రీనివాస్, కేవీకే రంగారావు, కే. విజయలక్ష్మి, నాయుడు వీర్రాజు, తదితరులు పాల్గొన్నారు. అలాగే రాజమహేంద్రవరం పార్లమెంటు నియోజకవర్గ కార్యాలయంలో చంద్రబాబు పుట్టినరోజు వేడుకలను టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో బూరుగుపల్లి రాఘవులు, వేగి చిన్నా, కోడూరి ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. పశివేదల, దొమ్మేరులో కూడా వేడుకలను ఘనంగా నిర్వహించారు.

తాళ్లపూడి: సీఎం చంద్రబాబు నాయుడు జన్మదిన వేడుకలను ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. తాళ్లపూడి టీడీపీ గ్రామాధ్యక్షుడు తైలం సంసతి ఆధ్వర్యంలో చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో నామన రవి కుమార్, గుండుబ ఓగులట ప్రసాద్, పేరూరి తాతారావు, ఈరెల్లి వెంకటేశ్వరరావు, దూళ్ల నాగు, తదితరులు పాల్గొన్నారు. గజ్జరంలో టీడీపీ సీని యర్ నాయకులు కాకర్ల వంశీ, కొర్లపాటి అబ్బు లు ఆధ్వర్యంలో మెయిన్ రోడ్డులో గల ఎన్టీఆర్ విగ్రహం వద్ద సీఎం పుట్టినరోజు వేడుకలను నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ దండమూడి శేషు, గన్నిన సత్తిబాబు, ఓలేటి హరేరాం, మాజీ సర్పంచ్ రాములు, గుడ్ల ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. బల్లిపాడులో యువగళం సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మద్దుకూరి శంకరం, దుగ్గిరాల జగదీష్, ఉప్పులూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు. తిరుగుడుమెట్టలో టీడీపీ నాయకులు అన్నమరెడ్డి సత్తి బాబు, అన్నమరెడ్డి రమణ, ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు. అన్నదేవర పేటలో టీడీపీ సీనియర్ నాయకులు కొఠారు వెంకట్రావు ఆధ్వర్యంలో జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో షైనం గంగరాజు, గోపాలకృష్ణ, సుబ్బు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: నవ్యాంధ్రను ప్రగతి పథంలో నడిపించే ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకే దక్కుతుందని టీడీపీ మండల అధ్యక్షుడు ఆంద్రూ అనిల్ అన్నారు. మండలంలో సీఎం జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బస్టాండ్ వద్ద కేకును కట్ చేశారు. మండలలో టీడీపీ మండల మాజా అధ్యక్షుడు కొయ్యలమూడి చినబాబు ఆధ్వర్యంలో చలివేంద్రాన్ని ఏర్పాటుచేశారు. టీడీపీ నాయకుడు గన్నమని హరికృష్ణ, ఉప్పులూరి రాంబాబు, పెనుమత్స సుబ్బరాజు, యాగంటి వెంకటేశ్వరరావు, గద్దే శ్రీనివాస్, బొల్లిన విజయభాస్కర్, కాట్రు భీమరాజు, కంటిపూడి సుబ్బారావు, నాగరాజు, పిన్నమనేని సత్యనారాయణ, మెంతిమి అమరావతి, గద్దే రమాదేవి, కాకర్ల సృజనాచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

నల్లజర్ల: రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించే అపర మేధావి ముఖ్యమంత్రి చందబాబు అని ఎమ్మెల్యే మద్ది పాటి వెంకటరాజు అన్నారు. ఆదివారం సాయంత్రం ఘంటావారి గూడెంలో ఎమ్మెల్యే, పార్టీ నాయకులు కేఎస్ జవహర్, రాజీవ్ కృష్ణ, మాజీచైర్మన్ ముళ్లపూడి బాపిరాజు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఏఎంసీ చైర్మన్ యద్దన పూడి బ్రహ్మరాజు, టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, కూచిపూడి భాస్కరరావు, ఏలేటి సత్యనారాయణ (జేడీ) షేక్‌మీరా, జన సేన పార్టీ నాయకులు అచ్యుత సత్యనారా యణ, చోడసాని బాపిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ఉండ్రాజవరం, వేలివెన్ను, పాలంగి, తాడిపర్రు, చిలకపాడు, కాల్ధరి, సూర్యారావుపాలెం, చివటం, మోర్త,తదితర గ్రామాల్లో సీఎం చంద్రబాబునాయుడు పుట్టినరోజు వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు కేకును కట్ చేసి పంచుకున్నారు.

పెరవలి: రాష్ట్ర మనుగడ కోసం 75 సంవత్సరాలు వయస్సులో కూడా నవయువకుడి వలే సీఎం చంద్రబాబు పనిచేయడం తెలుగుప్రజల అదృష్టమని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు పేర్కొన్నారు. నిడదవోలు నియోజవర్గ టీడీపీ ఆధ్వర్యంలో చంద్రబాబు జన్మదిన వేడుకలను పెరవలిలోని దీపికా ఫంక్షన్ హాలులో ఆదివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషారావు మాట్లాడుతూ తన పరిపాలనలో సరికొత్త పద్ధతులు ప్రవేశపెట్టి దేశానికి, ప్రపంచానికి ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా టీడీపీ కార్యకర్తలచే ఏర్పాటు చేసిన రక్తదాని శిబిరాన్ని ప్రారంభించారు. అనంతరం పలువురు పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నిడదవోలు, ఉండ్రాజవరం, పెరవలి మండలాల పార్టీ అధ్యక్షులు వెలగన సూర్యారావు, సింహాద్రి రామకృష్ణ, అతికాల శ్రీను, నాయకులు భూపతిరాజు రవివర్మ, సలాది కృష్ణమూర్తి, బొడ్డు రామాంజనేయులు, హనుమంతు సుబ్రహ్మణ్యం, కంటిపూడి సూర్యనారాయణ, తదితర నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

గోపాలపురం: భావితరాల దార్శనికుడు ముఖ్యమంత్రి చంద్రబాబు అని టీడీపీ మండల అధ్యక్షుడు రొంగల సత్యనారాయణ అన్నారు. గుడ్డిగూడెంలో సీఎం 75వ జన్మదిన వేడుకలు ఎంపీటీసీ బొర్రా అంజనేయులు ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ కేకును కోసి కార్యకర్తలకు పంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నాడు ఐటీతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అంకురార్పణ చేసి, ప్రస్తుతం నవ్యాంధ్ర నిర్మాణం కోసం ఏఐకి శ్రీకారం చుట్టారన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా పీ4 లక్ష్య సాధనే ధ్యేయం గా పనిచేస్తున్నారన్నారు. కార్యక్రమంలో పడమ టి శ్రీనివాస్, బాలిన రాము, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చాగల్లు: ముఖ్యమంత్రి చంద్రబాబు పుట్టినరోజు వేడుకలు మండలంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. స్థానిక సెంటర్‌లోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ఏఎంసీ చైర్మన్ నాదెళ్ళ శ్రీరామ్ చౌదరి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు కేకును కట్ చేశాయి. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కరుటూరి సతీష్, కేతా సాహెబ్, తాళ్ళూరి ప్రసాద్, జొన్నకూటి సుబ్బారావు, కాశివర్జుల శర్మ, దొంగ రామకృష్ణ, పాశం రామకృష్ణ, జొన్నకూటి వెంకాయమ్మ ఈడుపుగంటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



పెరవలిలో 75 కేజీల భారీ కేక్‌ను కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శేషారావు, తదితరులు



గుడ్డిగూడెంలో కేకును కోస్తున్న సత్యనారాయణ, ఇతర నేతలు



కొవ్వూరు బస్టాండ్ సెంటర్‌లో చంద్రబాబు ఫొటోకు పాలాభిషేకం చేస్తున్న టీడీపీ నాయకులు



పాలంగిలో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న టీడీపీ నేతలు



గజ్జరంలో కేకు కట్ చేస్తున్న కాకర్ల వంశీ, శేషు, దత్తుడు, తదితరులు



చాగల్లు సెంటర్‌లో చంద్రబాబు పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



దేవరపల్లిలో కేకును కట్ చేస్తున్న టీడీపీ నాయకులు, తదితరులు



ఘంటావారిగూడెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, జవహర్, రాజీవ్‌కృష్ణ, బాపిరాజు

అగ్నిప్రమాదాలపై అప్రమత్తత అవసరం



మాట్లాడుతున్న ఫైర్ అధికారి వేణు

కొవ్వూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): అగ్నిప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు పాటిస్తే ప్రమాదాలను నివారించవచ్చని అగ్నిమాపకశాఖ అధికారి వీఎస్ఎన్ఎస్ వేణు అన్నారు. ఆదివారం కొవ్వూరు అగ్నిమాపక శాఖ కార్యాలయంలో వారోత్సవాల ముగింపు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫైర్ అధికారి వేణు మాట్లాడుతూ విద్యుత్, గ్యాస్ వినియోగించే సమయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం పలువురు అధికారులు అగ్నిప్రమాదాల నివారణపై మాట్లాడారు. కార్యక్రమంలో ఆంధ్రా సుగర్స్ అసిస్టెంట్ పర్సనల్ మేనేజర్ సీహెచ్ఎస్ మహర్షి, జే. రఘు, సగ్గొండ పరమేసు బయోటెక్ సిబ్బంది, కార్మికులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

మోర్తలో ఆరు కాసుల బంగారం చోరీ

ఉండ్రాజవరం, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): మోర్తకి చెందిన పోతా ప్రగడ సూర్యకుమారి ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు చొరబడి ఆరు కాసుల బంగారం దొంగిలించినట్టు ఎస్ఐ జీ. శ్రీనివాసరావు ఆదివారం తెలిపారు. శనివారం రాత్రి ఇంట్లో పడుకున్న సమయంలో తలదిండు కింద ఉన్న గొలుసు అపహరణకు గురైనట్టు సూర్యకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

కొట్లాటలో ఇరువురిపై కేసు

కొవ్వూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): కొట్లాట ఘటనలో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్టు కొవ్వూరు రూరల్ ఎస్ఐ కె. శ్రీహరిరావు తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం... పంగిడికి చెందిన కాసాని సున్నీ తన బైక్‌ను స్పీడుగా నడుపుతూ కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. గతంలో హెచ్చరించినా తీరు మార లేదు. ఈ క్రమంలో మరలా ఈనెల 19వ తేదీన రాత్రి అదే స్పీడుగా నడుపుతుండడంతో ఆకుల ప్రసన్న సతీష్‌కుమార్ అడ్డుకుని ప్రశ్నించాడు. దీంతో సున్నీ ఇంటికి వెళ్లి తన తండ్రి కొండలరావుతో వచ్చి సతీష్‌కుమార్‌తో ఘర్షణ పడ్డారు. ఈ ఘటనలో ఇరువురికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రి సమాచారం మేరకు ఇరువురిపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ ప్రార్థనలు



శ్మశానవాటికలో పూర్వీకులకు నివాళి అర్పిస్తున్న చైర్‌పర్సన్ రత్నకుమారి, క్రైస్తవులు

కొవ్వూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : క్రైస్తవులు క్రీస్తు పునరుత్థాన (ఈస్టర్) పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. క్రైస్తవ మత విశ్వాసులు సమాధుల తోటను శుభ్రపరచుకుని, పూర్వీకుల సమాధులకు రంగులు వేసి పూలతో అలంకరించారు. సమాధుల వద్ద కొవ్వొత్తులు వెలిగించి, ప్రార్థనలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమా రి, రాజేష్ (బెన్నీ) కొవ్వూరు క్రిస్టియన్ శ్మశానవాటికలో తమ పూర్వీకుల సమాధుల వద్ద పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు.

ఉండ్రాజవరం: పలు గ్రామాల్లో ఈస్టర్ వేడుకలను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయాన్నే తమ పూర్వీకుల సమాధుల వద్దకు వెళ్లి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు చేశారు. ఉండ్రాజవరంలోని లూథరన్, బైబిల్ మిషన్, పెంతుకొస్తు, ఆర్‌సీఎం, తదితర చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్లు క్రీస్తు పునరుత్థానము గురించి వివరించారు. పలు చర్చిల వద్ద అన్నసమారాధనలు, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.



ఉండ్రాజవరంలో సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న దృశ్యం

కోటసత్తెమ్మకి విశేష పూజలు

నిడదవోలు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): తిమ్మరాజుపాలెంలో వేంచేసిన కోటసత్తెమ్మ వారి దేవస్థానంలో ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవతో ప్రారంభమై ధూపహారతి, నిత్యార్చన, లలితా పారాయణం, సహస్రనామ కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి క్షీర, మహా నివేదన చేశారు. ఆదివారం అమ్మవారికి ఇష్టమైన రోజు కావడంతో పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. అమ్మవారికి ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 40, 260, అన్నదాన విరాళాల ద్వారా రూ.28, 250, ప్రసాద విక్రయాల ద్వారా రూ. 34,370, పూజా టికెట్లు, ఇతర టికెట్ల ద్వారా రూ. 67,216, మొత్తం రూ.1,70,094 ఆదాయం లభించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ అండ్ చైర్మన్ దేవులపల్లి రవిశంకర్ తెలిపారు. అలాగే కె.పెంటపాడుకు చెందిన టీర్ల వెంకట సత్యనారాయణ కుటుంబ సభ్యులు అమ్మవారికి 14 గ్రాముల 770 మిల్లీగ్రాముల బంగారాన్ని, రాజమండ్రికి చెందిన వానపల్లి మురళీకృష్ణ కుటుంబ సభ్యులు 400 గ్రాముల వెండి అష్టలక్ష్మి చెంబును, నిడదవోలుకు చెందిన చవ్వాకుల నాగ మల్లిఖార్జునరావు, సాయి కుమారి దంపతులు అమ్మవారి ఆలయంలో అన్నదానానికి రూ. 25 వేలను విరాళంగా అందించినట్టు దేవస్థానం సహాయ కమిషనర్ వి.హరి సూర్యప్రకాష్ తెలిపారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

దూబచర్లలో ఉచిత గుండె వైద్యశిబిరం

నల్లజర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దూబచర్ల లయన్స్ క్లబ్, పార్డ్ ఇండియా సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో విజయవాడకు చెందిన హెల్ప్ ఆసుపత్రి వైద్యబృందం సహకారంతో ఆదివారం దూబచర్ల సంఘమిత్ర హైస్కూల్‌లో ఉచిత గుండె వైద్యశిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ కిరణ్ తన సిబ్బందితో వచ్చి 120 మందికి వైద్యపరీక్షలు చేశారు. వీరిలో 15 మందికి రిఫర్ చేశారు. క్యాంపు ఆర్గనైజర్ అంబటి శ్రీనివాస్, లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు కెల్లా వాసు, పార్డ్ సంస్థ అధ్యక్షుడు ఎండీ షరీఫ్, కూచిపూడి ఉదయభాస్కరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగిసిన క్రికెట్ పోటీలు



విజేతలకు కప్‌లను అందజేస్తున్న రమేష్‌బాబు, నాగరాజు

కొవ్వూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో మానసిక వికాసం కలుగుతుందని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్య క్షుడు కంఠమణి రమేష్‌బాబు, ఎంపీటీసీల చాంబర్ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు ముదునూరి నాగరాజు అన్నారు. ఎన్టీఆర్ క్రీడా ప్రాంగణంలో గత మూడు రోజులుగా రాజు కొవ్వూరు యూత్ ఆధ్వర్యంలో జరుగుతున్న క్రికెట్‌పోటీలు ఆదివారంతో ముగిశాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 15 జట్లు తలపడగా, ప్రథమ స్థానంలో నిలియిర కొవ్వూరు పట్టణ జట్టుకు రూ.10 వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన వేములూరు జట్టుకు రూ. ఎనిమిది వేలు నగదు బహుమతిని ముఖ్యఅతిథుల చేతులమీదుగా అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు భూపతి రాజు, తరుణ్, రవి, సాయికృష్ణ, దివాకర్ పాల్గొన్నారు.

విశ్వ హిందూ పరిషత్‌లో నూతన నియామకాలు



నల్లజర్లలో నూతనంగా నియామకమైన సభ్యులు

నల్లజర్ల, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): విశ్వ హిందూ పరిషత్‌లోకి కొందరి నూతన వ్యక్తులను చేర్చుకోవడం జరిగిందని వీహెచ్‌పీ ఉత్తరాంధ్ర గోరక్షక్ ప్రముఖ్ సుబ్బరాయుడు, నల్లజర్ల మండల అధ్యక్షుడు కందుల రవిశేఖర్ తెలిపారు. ఆదివారం సభ్యుల వివరాలను వెల్లడించారు. విశేష సంపర్క ప్రముఖునిగా మన్నే వేణుప్రసాద్, మండల సహ కార్యదర్శిగా పాము శ్రీను, మండల భజరంగదళ్ అధ్యక్షుడిగా శ్రీపాద సాయిప్రకాష్, ఉపాధ్యక్షుడిగా వీరమళ్ళ అజయ్, సమరసతా ప్రముఖునిగా నందమూరి రామకృష్ణను నియమించారు. కొవ్వూరు ఖండ కార్యదర్శి ముత్యాల గంగాధర్, జిల్లా సహాయ కార్యదర్శి సవలం రామకృష్ణ, మాయలేడి తాతారావు ఉన్నారు.

దేచర్లలో ధ్వజస్తంభ ప్రతిష్ఠ



కార్యక్రమంలో పాల్గొన్న ఆలయకమిటీ సభ్యులు, గ్రామస్థులు

కొవ్వూరు, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): దేచర్లలో వేంచేసియున్న కోదండ రామాలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా విశేష పూజలు నిర్వహించారు. సీతారాములు సహిత లక్ష్మణ ఆంజనేయ స్వామివార్ల నూతన విగ్రహాల ప్రతిష్ఠ, నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవాలను శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం భక్తులకు అఖండ అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో చౌటిపల్లి వీరన్న, ఉప్పులూరి నానాజీ, సర్పంచ్ గోశాల నాగార్జున, దేచర్ల గ్రామ భక్తబృందం, నాయకులు, గ్రామస్థులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఘనంగా పునరుత్థాన దినం

ధవళేశ్వరం, ఏప్రిల్ 20(ఆంధ్రజ్యోతి): ధవళేశ్వరంలో ఈస్టర్ పండుగను సోదరులు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఏసు క్రీస్తు సమాధి నుంచి తిరిగి లేచిన సందర్భంగా పె ద్దల సమాధులను అలకరించి కొవ్వొత్తులు వెలిగించి ప్రార్థనలు నిర్వహించారు. తెల్లవారు జామునే సమాధుల వద్దకు వచ్చిన క్రైస్తవులకు టీడీపీ నాయకులు కొడమంచిలి సూర్య ఆధ్వర్యంలో అల్పాహారం, పాలు అందించారు. టీడీపీ ఆరోగ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి గోరంట్ల రవిరామ్‌కిరణ్ విచ్చేసి అల్పాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్రైస్తవులకు ఈస్టర్ శుభాకాంక్షలు తెలిపారు. టీడీపీ నాయకులు పండూరి అప్పారావు, నీలికోటేశ్వరరావు, పిన్నంటి ఏకబాబు, బర్రి సుబ్బారావు, పల్లా రామసామి, ఆళ్ళ విఠల్, తాతపూడి ఆనంద్, జనసేన నాయకుడు యడ్ల మహేష్ పాల్గొన్నారు.

జ్ఞానసరస్వతి ఆలయాన్ని సందర్శించిన ఎంపీ పురందేశ్వరి



గౌతమిఘాట్ వద్ద జ్ఞాన సరస్వతి ఆలయాన్ని సందర్శిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం సరస్వతి ఘాట్‌లోని శ్రీ జ్ఞానసరస్వతి ఆలయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ పురంధేశ్వరి ఆదివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ మేనేజింగ్ ట్రస్టీ తోట సుబ్బారావు ఎంపీకి పూర్ణ కుంభంతో స్వాగతం పలికి, చిరు సత్కారం చేశారు. అక్కడ జరుగుతున్న నిర్మాణాలను ఎంపీ పరిశీలించారు.

ఎంపీని కలిసిన నన్నయ వీసీ

ఆదికవి నన్నయ యూనివర్శిటీ వీసీ ఆచార్య ఎస్.ప్రసన్న ఆదివారం సాయంత్రం రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. మొక్క అందజేసి శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా వారిరువురు విశ్వవిద్యాలయానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. విశ్వవిద్యాలయం అభివృద్ధికి తనవంతు సహకారం అందజేస్తానని ఎంపీ పేర్కొన్నారు.

బీజేపీలో చేరికలు

కాకినాడ జిల్లాకు చెందిన పలువురు ఆదివారం సాయంత్రం ఎంపీ పురందేశ్వరి సమక్షంలో బీజేపీలో చేరారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఏప్రిల్ 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని, న్యాయమూర్తి అధ్యక్షతన పే రివిజన్ కమిషన్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు పి.గిరిప్రసాద్ వర్మ అన్నారు. ఆదివారం అసోసియేషన్ సమావేశం రాజమహేంద్రవరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌస్ ఆవరణలో నిర్వహించారు. ఈ సందర్భంగా గిరిప్రసాద్ వర్మ మాట్లాడుతూ ఉద్యోగుల డిమాండ్ల సాధన కోసం జూన్ నెలలో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాన్ని అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించనున్నామని అన్నారు. ఈ నెల 12 సంఘం రాష్ట్ర కమిటీ తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా ఈ కార్యక్రమం జరుగుతుందని వెల్లడించారు. ఉద్యోగ సమస్య పరిష్కార వేదిక ఏర్పాటు చేయాలని, తాత్కాలిక భృతి ప్రకటించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో జిల్లా సహఅధ్యక్షుడు చాంబర్లీన్, ఉపాధ్యక్షులు కె.వెంకటేశ్వరరావు, పి.రవి కుమార్, జిల్లా కార్యదర్శులు రమేష్, శ్రీనివాస్, దినేష్, గోపాలకృష్ణ పాల్గొన్నారు.